నీతిగానుగ

గోడమీది పాత గడియారం పండ్రెండు కొట్టింది — ముల్లులు పదకొండున్నరే చూపుతున్నా. కండ్లు తెరవకుండానే ప్రక్కన వున్న వుయ్యాలను మరొకసారి అటూ యిటూ వూపి సుబ్బరామయ్య కుడివైపు తిరిగి పండుకున్నాడు. గడియారం కొట్టిన గంటల శబ్దానికో, తండ్రి వుట్టిపాటుగా వూపినందు వల్లనో వుయ్యాలలోని చంటిపిల్ల దీర్ఘంగా మూల్గింది. సుబ్బరామయ్య విసుక్కుంటూ మళ్ళీ యెడమ వైపు తిరిగి ఉయ్యాలను ఆడించటం ఆరంభించినాడు. నాలుగైదు నిమిషాల తర్వాత పసిపిల్ల నిద్రపోయిందనే నమ్మకం కలిగి అతను మరొకసారి కుడివైపు తిరిగి గట్టిగా కండ్లు మూసుకొని నిద్రపోవడానికి ప్రయత్నించినాడు.

పొరుగింటిలో నుండి మళ్ళీ బూరగమేళం వినిపించింది. అర్ధ నిమిషంలో సన్నాయీ, తాళాలూ, మద్దెలా తోడై ఏదో సినిమాపాట యెత్తుకున్నాయి. పొరుగింట్లో పెండ్లి జరుగుతున్న రాత్రి తాను నిద్రపోవడానికి ప్రయత్నించడమే అవివేకం అనుకుంటూ అతను లేచి కూర్చున్నాడు.

అస్తమించే సప్తమి చంద్రుని మసక వెన్నెల కిటికీగుండా లోపల పడుతున్నది. నవంబరు మొదటి వారపు చల్లని పడమటి గాలికి ఎర్రగన్నేరు కొమ్మలు మెల్లగా కదులుతున్నాయి. సుబ్బరామయ్య లేచివచ్చి కిటికీ దగ్గర నిలబడినాడు. చల్లగాలి అతని ముఖాన్ని సుకుమారంగా స్పృశించింది. గన్నేరు కొమ్మ కొనలోని యెర్రని పూలగుత్తి వయ్యారంగా వంగి ఒక క్షణం అర్ధచంద్రునికి సంపూర్ణంగా అడ్డుపడింది. పెండ్లి యింటి ముందు లైట్ల వెలుతురులో వీధిలోని పిల్లలు కోలాహలంగా అల్లరి చేస్తున్నారు.

వాళ్ళతో కలిసి ఆడుకుంటూ వుండిన తన పదేండ్ల కొడుకు మురళిని అతను తొమ్మిది గంటలప్పుడే బలవంతంగా లాక్కొని వచ్చినాడు. పిల్లవాడు వున్నాడో లేదో అని తిరిగి చూసినాడు. టేబుల్ దగ్గర వున్న మంచం మీద మురళి కడుపులో కాళ్ళు పెట్టుకొని నిద్రపోతున్నాడు. వుయ్యాలకు అవతల వున్న భార్య మంచం ఖాళీగా వుంది. అతనికి భార్యమీద మనసు పోయింది.

తొమ్మిది గంటలు కాకముందే తాను పెండ్లివా రింట్లో భోంచేసి వచ్చినాడు. తన భార్య యీ రాత్రికి పెండ్లివా రింట్లోనే వుంటానని చెప్పింది. మధ్యాహ్నం నుండి వాళ్ళింట్లోనే వుంది, పెండ్లి పనుల్లో సాయం చేస్తూ. తమ అందరి భోజనాలూ యీ దినం పెండ్లి యింట్లోనే జరిగినాయి. పసిపిల్ల యేడిస్తే చెప్పి పంపమని ఒకటికి పదిసార్లు ఒత్తి ఒత్తి చెప్పింది. అంత శ్రద్ధ వున్నది అప్పుడప్పుడూ వచ్చి చూసిపోవచ్చునే? చెప్పి పంపడానికి సౌకర్లు యెవరున్నారని? ఉన్న పిల్ల వెధవ ఒక్కడూ పడి నిద్రపోతున్నాడు. ఈ ఆడవాళ్ళ అతి స్నేహాలతో మగవాళ్ళకు కంఠానికి వస్తుంది. మేళతాళాల వెధవ గోలతో నిద్ర పట్టకపోవడానికి తోడు యీ రోజే భార్య కూడా లేదు.

తన భార్యను పిల్చుక రావడానికి మురళిని లేపి పంపుదామని అనుకున్నాడు అతను. మెల్లగా పోయి టేబుల్ మీద తగ్గించి వుంచిన లాంపు యెక్కించి, మురళీ మురళీ అని రెండుసార్లు పిలిచినాడు. మురళి పలకలేదు. చేతితో తట్టిలేపుదామని లాంపు తీసుకొని మురళి తల దగ్గరకు పోయినాడు. లాంపు వెలుతురులో, గాఢ నిద్రలో వున్న పదేండ్ల పసి ముఖం చూసి అతని పురుష హృదయం సిగ్గు పడింది. ఈ అర్ధరాత్రి వేళ యీ పసివాని నిద్ర పాడుచేయడం దేనికోసం? లాంపు టేబుల్ మీద పెట్టి అతను మళ్ళీ కిటికీ దగ్గరకు పోయినాడు.

బయటి నుండి చల్లని గాలి అల వచ్చి అతని ముఖంమీద కొట్టింది. ఒళ్ళంతా ఒక్కసారి జలదరించింది. ఈ సంవత్సరం అప్పుడే చలి ప్రారంభమైంది. బయట మంచుపడుతూ వుందేమో. చంటి పిల్ల ఒకసారి గట్టిగా ఏడ్వనైనా యేడ్వదు — పిల్ల పోరు పెట్టుకుందని మురళిని లేపి వాళ్ళమ్మ కోసం పంపవచ్చు.

పిల్చుక రావడానికి తానే స్వయంగా పోతే? పిల్ల ఏడ్వకపోయినా, లేచి ఏడుస్తున్నదని పోయి అబద్ధం చెప్పితే? లాభం లేదు. ఏడ్చే పిల్లను యెత్తుక రాకుండా వదలిపెట్టి వచ్చినారా! — అంటూ భార్య తన్ను దెప్పుతుందేమో? ఔను — తన భార్య సంగతి తనకు తెలియదూ! పదిమంది లోనూ దెప్పుతుంది. ఈ ఆడవాళ్ళకు మగవాళ్ళ అవసరాలు గుర్తించడం చేతగాకపోయినా, దెప్పడం మాత్రం బాగా చేతనవును.

ఆ పెండ్లి యింట్లో అంత మంది ఆడవాళ్ళ మధ్య భార్యకోసం వెతకడం కూడా కష్టమే. ఆ ఆడవాళ్ళలో యెవరైనా తన మనసులోని ఉద్దేశం పసిగట్టితే తన గౌరవం కాసుకు కొరగాకుండా పోదూ! తన భార్య మాత్రం యింటికి వచ్చి కదలకుండా నిద్రపోయే పసిపిల్లను చూసి ఏమనుకుంటుంది? తన మనసులోని కోర్కెను వెల్లడిస్తే ముఖం మీదనే నవ్వుతుంది. కాదు — యెత్తి పొడుస్తుంది. ఒక్క రాత్రికూడా వుండలేరా అంటూ అపహాస్యం చేస్తుంది. ఈ ఆడవాళ్ళ బుద్ధులే అంత! మగవాళ్ళ అవసరాలంటే వీళ్ళకు అంత చులకన!

తాను చెప్పి పంపకపోతే మాత్రం యీ మనిషి ఒకసారి రాకూడదూ? ఒకసారి వచ్చి పిల్లకు పాలిచ్చి పోకూడదూ? ఒక్కసారి వస్తే అన్నీ సరిపోతాయి. పిల్లకు పాలివ్వాలనే జ్ఞానం కూడా లేని ఆడవాళ్ళతో కాపురం చేయవలసి వచ్చింది, తన బ్రతుక్కు.

ఐనా ఒక్క రాత్రికి యింత బాధ పడడం కూడా బాగాలేదు. ఏమిటో వెధవ బ్రతుకు! మనిషి యెంత చదువు చదువుకున్నా మనసులోని కోర్కెలు పశువుల స్థాయిలోనే వుంటాయి. తన కున్నట్లే అందరికీ వుంటాయేమో? తాను మళ్ళీ హైస్కూల్లో యింగ్లీషు టీచరు! బియ్యేయల్టీ చదివిన తనకే యిట్లుంటే యింక మామూలు మనుషుల కెట్లుంటుందో?

తన కోర్కెలో మాత్రం తప్పేముంది? భార్యమీద కోర్కె కలగడం తప్పని యెవరనగలరు? అదీ తప్పే ఐతే యింక తప్పొప్పులకు అర్థమేలేదు. తప్పుపని చేయకుండా కోర్కెలు తీర్చుకోడానికే గదా భర్తకు భార్యా, భార్యకు భర్తా వుండడం? కానీ అంత మాత్రం జ్ఞానం వుంటేనా యీ మనిషికి? యిప్పుడొక వేళ వచ్చినా, పిల్లకు పాలిచ్చి వెంటనే మళ్ళీ పెండ్లివారింటికి పోవాలంటుంది. తన కోర్కె వెల్లడిస్తే తానేదో నీచపు పని చేస్తున్నట్లు వెటకారంగా చూస్తుంది. ఏం మనిషో!

అసలు వస్తేనా! వెటకారంగా చూస్తే చూస్తుంది — ఒకసారి వస్తే ఎట్లైనా చావవచ్చు. వెక్కిరించినా వెటకారం చేసినా తన భార్యేగా! తన భార్య తన్ను ఏమనుకుంటే ఏం భయం! ఏమనుకున్నా భార్య భార్యే, భర్త భర్తే.

ఈ మనిషి యింక రాదు. తానెంతసేపు కాచుకున్నా యింక లాభం లేదు. తానింత వ్యథపడుతున్నాడే, యీ మనిషికి చీమకుట్టినట్లైనా వుండ దేమో? ఈ ఆడవాళ్ళకు ప్రేమంటే ఏమిటో తెలిస్తేనా! పూర్వకాలం పతివ్రతలే నయం — ప్రేమవున్నా లేకపోయినా మగవాళ్ళను పూజించే వాళ్ళు. ఇప్పటి ఆడవాళ్లు భర్తలను పూజించనూ పూజించరు, ప్రేమించనూ ప్రేమించరు. అటు గౌరవమూ లేదు, యిటు ప్రేమా లేదు. లోకం ఏమౌతున్నదో!

గోడ గడియారం అరగంట కొట్టింది.

పంద్రెండయిం దన్నమాట. ముహూర్తం రెండు గంటలకు. ఒంటి గంటకే వచ్చి లేపుతానన్నాడు సోమసుందరం. ఇప్పుడింక పండుకున్నా, నిద్రపోవడమూ మళ్ళీ ఒంటి గంటకు లేవడమూ కష్టంగానే వుంటుంది. ఏదో విధంగా యీ గంట సేపూ మేలుకోవడమే మేలు. సోమసుందరం వచ్చి పిలవక ముందే తనే పోతే మరీ బాగుంటుంది. కళ్యాణి పెండ్లికి తన్నొకరు పిలువవలసిన పనికూడా లేదు. సోమసుందరమూ తానూ యిరుగు పొరుగులే కాదు – పరస్పరం ఆత్మీయతకూడా వుంది. ఆడవాళ్ళ చెలిమి మరీ బలంగా వుంది. అందుకే తన భార్య మధ్యాహ్నం నుండి పెండ్లి పనుల్లో మునిగింది. అసలు కళ్యాణి సోమసుందరం కూతురైనా ఆమెకు తన దగ్గరే యెక్కువ చనువుంది. తన్ను మామా అనీ, తన భార్యను అత్తా అనీ పిలుస్తూ చిన్నప్పటి నుండి తన యింట్లో తిరుగుతూ పెరిగింది. తెలివైన పిల్ల ; ఏ మాత్రం కపటం లేని మనిషి. కన్న కూతురు కన్న మిన్నగా తన అభిమానం చూరగొనింది. ఈ అమ్మాయి పెండ్లికి తానూ, తన భార్యా పిలవకుండానే పోయి పెండ్లి పనులు జరిపించవలసిన బాధ్యత వుంది. అందుకే తన భార్య పోయిందిగా. తాను కూడా తనకు చేతనై నంత చేస్తూనే వున్నాడు. పెండ్లికొడుకు పిల్లను చూడడానికి వచ్చిన రోజున తాను స్కూలుకు అర్ధదినం సెలవు పెట్టినాడు. పెండ్లికొడుకుతో యింగ్లీషు మాట్లాడే వాళ్ళు యెవరూ లేరని సోమసుందరం తన్ను మరీ మరీ ప్రాధేయపడినాడు. తమ రెండు కుటుంబాలకూ అర మరికలు లేని సంబంధం వుంది – తాను అంత మాత్రమైనా చేయక తప్పు తుందా ! ఈ పెండ్లి సంబంధం కుదరడంలో కూడా తన సహాయం అంతో యింతో వుంది. పెండ్లి కొడుకు కల్యాణి రూపురేఖలు మాత్రమే స్వయంగా చూసినాడు కానీ, ఆ అమ్మాయి తెలివితేటలను గురించి తన

మీదనే ఆధారపడినాడు. తాను చెప్పింది నమ్మినాడు. కళ్యాణికి ఇంగ్లీషు వ్యాకరణం నేర్పింది స్వయంగా తానే ఐతే! మా అమ్మాయి ముందర నీవు యింగ్లీషు మాట్లాడేవు, జాగ్రత్త, ఈ కాలం బియ్యే చదువులు నాకు తెలియవూ, అన్నాడు తాను. సెప్టంబర్ పరీక్షలో మళ్ళీ రెండు పార్టులూ ఫెయిలై వచ్చిన ఆ పెండ్లికొడుకు సరసంగా నవ్వినాడు. మంచి వాడే పెండ్లికొడుకు. అతని పేరు — ఆ — రఘుపతి — బియ్యే పాస్ కాలేకపోతేనేం — కావలసినంత ఆస్తి వుంది. కల్యాణి కే లోటూ వుండదు. ఆ పైన ఆమె అదృష్టం.

అంతే — అదృష్టం కాక యెవరు చేసేదేముంది! ఏదో తనకు చేతనైనంత తాను చేసినాడు. అంతకంటె తానేమి చేయగలడు! తన వుద్యోగంతోనే తనకు సరిపోతున్నది. ఎంత మొత్తుకున్నా అక్షరం ముక్క అంటని అడ్డగాడిదల కాంపోజిషన్ బుక్కులు కరెక్షన్ చేయడంతోనే తన ఆయుస్సు హరించిపోతున్నది. అన్నట్లు కరెక్షన్ చేయవలసిన బుక్కులు యింకా వున్నాయి. ఈ గంటసేపూ వూరక వుండడంకంటే....

సుబ్బరామయ్య టేబుల్ దగ్గరకుపోయి లాంపూ, ఫిష్తుఫారం కాంపోజిషన్ పుస్తకాలూ తీసుకొని వచ్చి కిటికీలో పెట్టినాడు. వీపు విరిగిన పాత కుర్చీ తెచ్చి కిటికీ దగ్గర పెట్టి జాగ్రత్తగా కూర్చున్నాడు. ఒక పుస్తకం తెరచి కాంపోజిషన్ చూసినాడు. మొదటి వాక్యంలో మొదటి పదమే స్పెల్లింగు తప్పు! ఈ వెధవలకు యింగ్లీషు నేర్పడంకంటె పందులకు పరిశుభ్రత నేర్పడం నయం! ఎర్ర పెన్సిల్ కోసం జేబు తడువుకున్నాడు అతను. విసుక్కుంటూ లేచి టేబుల్ డ్రాయర్‌లోవున్న ఎర్ర పెన్సిల్ తీసుకొని వచ్చి మళ్ళీ కరెక్షన్ ప్రారంభించినాడు.

సుబ్బరామయ్య యెర్ర పెన్సిల్ ఫిష్తుఫారం విద్యార్థుల యింగ్లీషు రచనా వైభవంమీద నిర్దాక్షిణ్యంగా దాడి చేస్తూ వుంద. పెండ్లి ఇంట్లో

మంగళ వాద్యాలు విశ్రాంతి తీసుకుంటున్నాయి. పిల్లల అల్లరి కూడా చాలావరకు తగ్గింది. అర్ధచంద్రుడు అస్తమించినాడు. శుభ్రమైన నవంబర్ నీలాకాశపు నీలిరంగు మరింత మెరుగెక్కింది. అనామకమైన మరి కొన్ని కోట్ల నక్షత్రాలు నిక్క పొడిచినాయి. దిక్కు తెలియని శీతకాలపు పిల్ల తెమ్మెర దక్షిణం నుండి వచ్చి మంచుతో పదునెక్కిన గన్నేరు కొమ్మల మధ్య నిశ్శబ్దంగా సుడి తిరిగింది. యెర్ర పెన్సిల్ ప్రయోగప్రవీణుడైన సుబ్బరామయ్య యివేమీ గమనించకుండా తన పనిలో పరవశం చెందినాడు.

మెల్లగా అస్పష్టంగా యేదో అలికిడైంది. భార్య వస్తున్నదేమో అని అతను ఆశగా వాకిలివైపు చూసినాడు. ఉద్వేగంతో గుండె ఉబికింది. ఊపిరి బిగబట్టి యెదురు చూసినాడు. యెవరూ రాలేదు. వేసిన తలుపులు వేసినట్లే వున్నాయి. తన బ్రతుక్కు అంతమాత్రం అదృష్టం కూడానా! నిరాశ చేసుకొని తల కాంపోజిషన్ వైపు తిప్పినాడు.

కొద్ది క్షణాల్లో మళ్ళీ చప్పుడు వినపడింది. యీ సారి స్పష్టంగా కిటికీ గుండా వినపడింది. ఉలికిపడి అతను బయటికి చూసినాడు. లాంపు వెలుతురులో పని చేసుకుంటూ వుండిన అతని కండ్లకు బయటి చీకటిలో, కిటికీకి బారెడు దూరంలో, మసక మసకగా అస్పష్టంగా ఒక అందమైన ఆకారం కనపడింది. గాజుల గలగలతో చేయెత్తి అతన్ని బయటికి రమ్మని సైగచేస్తూ వుంది. యెవరో తన్ను ఆహ్వానిస్తున్నారనే వివశత్వం అర్ధనిమిషంసేపు అతని మనసు నాక్రమించి చైతన్యరహితుని చేసింది. యింతలో చూపులు చీకటికి అలవాటుపడి తన్ను కల్యాణి పిలుస్తున్నదని అర్థమైంది. అర్థమైన ఆ అరక్షణంలో అతని హృదయంలో వేయి వింత వికారాలు వికసించినాయి. మనసులో పరస్పర విరుద్ధమైన పదివేల విపరీత భావాలు విజృంభించినాయి. చీకటి కోర్కెలూ ధార్మిక అనుబంధాలూ

వ్యక్తావ్యక్తంలో ఘర్షణ పడినాయి. గుండె వేగంగా కొట్టుకుంది. కల్యాణి! తన్ను పిలుస్తున్నది! "యేమిటి కల్యాణీ!" అన్నాడు అతను అకస్మాత్తుగా – అనాలోచితంగా.

కల్యాణి! పెండ్లికూతురు, ఒంటరిగా వచ్చింది! అర్ధరాత్రి సమయం! తన్ను రమ్మని సైగ చేస్తున్నది! అన్నిటికంటె ముందు అప్రయత్నంగా అతని మెదడుకు అర్థమైంది ఆమె ప్రవర్తనలోని రహస్య స్వభావం. అందుకు అనుగుణమైనట్లు అతని కంఠం కూడా అప్రయత్నం గానే మెల్లగా పలికింది — "యేమిటి కళ్యాణీ!" ఆశ్చర్యమూ ఆందోళనా మేళవించిన ఆ కంఠంలో రహస్యగోపనా తత్పరత ప్రముఖంగా వుంది.

కల్యాణి మళ్ళీ సైగ చేసింది. సుబ్బరామయ్య తొట్రుపాటుగా లేచి తలుపు తీసుకొని బయటికి వచ్చినాడు. కిటికీ దగ్గర వున్న కల్యాణి అతని కెదురుగా నాలుగడుగులు వడివడిగా ముందుకు నడిచింది. ఆమె నడక వేగానికి కొత్త బట్టలు కరకర లాడినాయి. నవంబర్ నక్షత్రాల మిణుకు మిణుకు కిరణాల చిరువెలుగులో ఆమె కన్నులు కాంతివంతంగా మెరిసినాయి. ఆమె ముఖంలోని భావం యేమీ అతనికి అర్థం కాలేదు. దగ్గరకు వచ్చి "యేమిటమ్మాయ్? యేమి సంగతి?" అని ఆదుర్దాగా ప్రశ్నించినాడు.

కల్యాణి ముఖమెత్తి యేదో చెప్పబోయి మళ్ళీ తల దించుకుంది. ఆమె ప్రవర్తన చూస్తే యేదో తీవ్రమైన ఆందోళనకు గురి ఐనట్లుంది. అతనికి వెంటనే అనుమానం వచ్చింది – తన భార్య కేదైనా – "చెప్పమ్మా. మీ అత్త కేమైంది?"

కల్యాణి మెల్లగా చెప్పింది: "నిన్ను నమ్ముకొని వచ్చినాను మామా!"

"యేమిటమ్మా ? యేమిటి ? సరిగా చెప్పు."

"నాకీ పెండ్లి వద్దు." ఆమె ముఖమెత్తి అతని ముఖంలోకి చూసింది.

"ఆఁ ! యిదేమిటి ! యెందుకు వద్దు ?"

ఆమె బదులు పలకకుండా అతని ముఖంలోకి చూస్తూ నిలబడింది.

"చెప్పు కల్యాణీ — యేం జరిగింది ?"

ఆమె జాలిగా జవాబు చెప్పింది : "యీ పెండ్లి తప్పించు మామా. నీవు తప్ప నా కింకెవరున్నారు ?"

"యేమిటమ్మా, నీకేమైనా పిచ్చి పట్టిందా ? యింకొక గంటలో పెండ్లి కాబోతుంటే ?"

ఆమె మౌనంగా తల దించుకుంది.

"యింట్లోకి పోదాంరా — యేమిటో వివరంగా చెప్పుదువుగాని" సుబ్బరామయ్య అన్నాడు.

"వద్దు మామా — నీవు సహాయం చేయకపోతే తిరిగిపోతాను."

"ఏమిటి కల్యాణీ నీ వెర్రి ? సంగతేమిటో చెప్పకుండానే సహాయం ఏమని చేయమంటావు ? మంచు పడుతున్నది — యింట్లోకి పోదాం రా."

"ఈ పెండ్లి తప్పిస్తానని మాట యిస్తే వస్తాను. చెప్పు మామా, లేకుంటే పోతాను."

"మళ్ళీ అదే మాటేనా ? పెండ్లి తప్పించడమంటే మాటలను కున్నావా ? రా — యిక్కడ వుంటే యెవరైనా చూస్తారు — లోపలికి పోదాం రా."

కల్యాణి బరువుగా సమాధానం చెప్పింది. "వద్దులే — పోతాను.

సహాయం చేయగల వానివి నీ వొక్కడివే వున్నావని నిన్ను నమ్ముకొని వచ్చినాను." ఆమె కంఠం దుఃఖంతో గద్గదమైంది. "నీవూ కాదంటే, నా బాధేదో నేనే పడతాను.

కల్యాణి కంఠంలోని బాధ సుబ్బరామయ్య గుండెల్లో గుచ్చుకుంది. ఆమెకూ తనకూ పదేడు పద్దెనిమిదేండ్ల యెడతెగని అనుబంధం వుంది. ఆమె జీవితంలో సగం తన యింట్లోనే గడచింది. తల్లిదండ్రుల దగ్గర కంటె తన దగ్గర యెక్కువ చనువు సంపాయించుకుంది. చిన్నప్పుడు తన ఒడిలో కూర్చుని ఆడుకుంది. తన రొమ్ము ఎక్కి తొక్కింది. తన వ్రేలు పట్టుకొని నడచింది. తన విస్తట్లో తిని పెరిగింది. తన దగ్గర పాఠాలు చెప్పించుకుంది. తన భార్యకు జబ్బుచేస్తే వచ్చి వండి పెట్టింది. తన పిల్లలకు సేవ చేసింది. ఒక్కసారి గతమంతా ముద్ద కట్టుకొని వచ్చి సుబ్బరామయ్య కన్నులముందు నిలిచింది. ఆమె కంఠంలోని గాద్గద్యం అతని వెన్నులో పొడిచింది.

"ఉండమ్మా — యెక్కడ పోతావు? నీ పిచ్చి నీదేకాని సంగ తేమిటో చెప్పవూ?" అతని కంఠంలో జాలీ, అనురాగమూ తొణికిస లాడినాయి.

అతని కంఠంలో వచ్చిన మార్పుకు కల్యాణిలోని ఆవేదన తగ్గింది. ఆశ నిండిన చూపులతో, వికసించే ముఖమెత్తి, నిండు గొంతుకతో ఆమె అడిగింది: "చేస్తావా మామా — సాయం చేస్తావా?"

"ఎందుకు చేయనమ్మా — నీవు కోరితే ఏదైనా చేస్తాను."

"ఐతే" కల్యాణి వెనక్కు తిరిగి చూసింది.

"ఏమిటమ్మా?"

ఆమె వడివడిగా నడిచి గన్నేరు పొదవద్దకు పోయింది. పొద చాటు నుండి ఒక యువకుడు యివతలికి వచ్చినాడు. యిద్దరూ కలిసి

క్షణంలో సుబ్బరామయ్య దగ్గరికి వచ్చినారు. ఎవరతను ? ఈ అమ్మాయి యెంత సాహసానికి ఒడిగట్టింది ? "ఎవరు కల్యాణీ ?" సుబ్బరామయ్యకు మనసు మనసులో లేదు. అగాధమైన లోయ అంచున నిలబడినట్లు భయంతో హృదయం కంపించింది.

"నేనేనండీ." ఆ యువకుడు జవాబు చెప్పినాడు.

"ఎవరు ? రాజగోపాలా ?"

"ఔను మామా." కల్యాణి ఉత్సాహంగా జవాబు చెప్పింది. "మేమిద్దరం ప్రేమించుకున్నాం. యెక్కడైనా పారిపోయి పెండ్లి చేసుకుంటాం."

సుబ్బరామయ్యకు గుండె ఆగినట్లైంది. నోట మాట రాలేదు. ఎంత పని చేసింది ! తన కండ్ల ముందు పెరిగిన కల్యాణి! అమాయకమైన ఆడపిల్ల అని యిన్నాళ్లూతాననుకొన్న కల్యాణి! తన అంతులేని అభిమానానికి పాత్రమైన కల్యాణి ! తన హృదయంలో గూడు కట్టుకున్న కల్యాణి ! అతనికి ప్రపంచమే తలక్రిందు లైనట్లైంది, నమ్మిన కులదేవతలే భూతాలై భయంకరంగా వికటాట్టహాసం చేసినట్లైంది.

"ఏమంటావు మామా ? మాకు సాయం చేస్తావు గదూ ?" కల్యాణి ఉత్కంఠతో ప్రశ్నించింది.

భయమూ, బాధా, క్రోధమూ ముప్పిరిగొన్న కంఠంతో సుబ్బ రామయ్య అన్నాడు : "ఇంత పని చేసినదానవు, నీకొకరి సాయ మెందుకు ?"

"ఆఁ ?"

"నీ కింకా ఏం సాయం కావాలి ?"

అతని కంఠంలోని పరుషత్వం ఆమెకు అర్థమైంది. "అదేమిటి

మామా ? నీ సాయమే మాకిప్పుడు చాలా అవసరం. నా ఒంటిమీద నగలున్నాయిగానీ, డబ్బేమీ లేదు. రాజా దగ్గర కూడా డబ్బేమీ లేదు."

"అంతేనా ?" సుబ్బరామయ్య వెటకారంగా అన్నాడు.

"డబ్బొకటే కాదు. నీవు మా వెంట వచ్చి మా పెండ్లి జరిపించు మామా. మా కింక యెవరున్నారు ? నీ విప్పుడే రాకపోతే మమ్మెక్కడ పొమ్మంటావో చెప్పు. నీవేమి చేయమంటే అది చేస్తాం."

"నేను చేయమనడ మెందుకు ? చేయవలసిం దంతా చేసి కూర్చు న్నావు."

"అంతేకాదు మామా — ముఖ్యంగా నీవు మా నాన్నకూ, అమ్మకూ నచ్చజెప్తావు కదూ ? మా పెండ్లి ఐన తర్వాత నీవు వాళ్ళను ఒప్పిస్తే సరిపోతుంది. లేకపోతే బ్రతికినన్నాళ్లూ యెడబాట్లు తప్పవు."

"నీకు అమ్మా నాన్నా కనిపిస్తూనే వున్నారా ?"

కల్యాణి తన ధోరణిలోనే చెప్పుకుపోతున్నది. "త్వరగా చెప్పు మామా. ఒంటి గంటకు రైలుంది. ఆ రైలుకు పొమ్మంటావా ? మద్రాసుకు పోదామనుకున్నాము. ఏమంటావు ? నీవూ యిప్పుడే వస్తావా మా వెంట ? త్వరగా కానీ మామా — రైలుకు టైమౌతున్నది."

పరిస్థితి అనుకూలంగా లేదని రాజగోపాల్‌కు అర్థమైంది. "కల్యాణీ, పోదాం రా" అన్నాడు అతను.

"ఉండు రాజా, ఏం మామా — రైలుకు పోదామా ?" ఆదుర్దాగా అడిగింది ఆమె.

సుబ్బరామయ్య యింతసేపూ ఆలోచనలకు వ్యవధి యివ్వని ఆవేశాలకు లోనైనాడు. రాజగోపాల్ మాటలతో అతనికి హఠాత్తుగా కర్తవ్యం స్ఫురించింది. కల్యాణి ఆపదలో వుంది — తాను రక్షించగలడు.

కల్యాణి సర్వనాశనమౌతున్నది — తాను ఉద్ధరించగలడు. కల్యాణి దుస్సహమైన దురంతానికి ఒడిగట్టింది — తాను అడ్డుపడగలడు. చేయవలసిన పని ఒక క్షణంలో నిర్ణయించుకున్నాడు అతను. "ఇంట్లోకి పోదాం రా. వివరాలన్నీ చెప్పితేగానీ నేనేమీ చెప్పలేను" అన్నాడు.

"వివరా లేమున్నాయ్ ? అసలింక టైం లేదు మామా — రైలు ఒంటి గంటకు వస్తుంది."

సుబ్బరామయ్య విసుగు ప్రదర్శించినాడు. "ఏమిటి కల్యాణీ ? ఇంట్లోకైనా పోకుండానే రమ్మంటావా నన్ను ? అసలు మీకు డబ్బు కావద్దూ ?"

అతని వెంట యింట్లోకి పోవడానికి పూనుకొని కల్యాణి ఒకడుగు ముందుకు వేసింది. రాజగోపాల్ తొందరగా అన్నాడు : "ఉండు కల్యాణీ — డబ్బేమీ అక్కరలేదు — పోదాం రా."

"అదేమిటి ?" కల్యాణి ఆశ్చర్యపడింది.

"డబ్బు తెచ్చేటట్లుంటే ఆయన్నే పోయి తెమ్మను. మన మిక్కడనే వుందాం, బయటనే వుందాం."

కల్యాణి ఒక క్షణం రాజగోపాల్ వైపు చూసింది. తిరిగి సుబ్బరామయ్య ముఖంలోకి చూసింది.

సుబ్బరామయ్య నిశ్చలంగా అన్నాడు : "పోదాం రామ్మా — టైమౌతున్నది."

కల్యాణి ముందుకు కదులుతూ అన్నది : "రా, రాజా — మా మామమీదనే అనుమానమా ?"

సుబ్బరామయ్య ఆమె ప్రక్కన నడుస్తూ అన్నాడు : "ఆతనెందు

కమ్మా? అతన్నిక్కడే వుండమను. నేను నీతో రెండు మూడు మాటలు మాట్లాడాలి."

"ఏం మాటలు మామా? రాజా వినకూడని మాట లేమున్నాయ్?"

"వినకూడని మాటలని కాదమ్మా. హఠాత్తుగా వచ్చి నన్నేదో చేయమంటున్నావు. ఏమి చేయవలసిందీ నేను ఆలోచించుకోవద్దూ? ఆలోచించుకోడానికి పరిస్థితి ఏమిటో వివరంగా తెలుసుకోవద్దూ? నీ మనసులో ఏముందో నా కిప్పటికీ సరిగా అర్థమే కాలేదు."

వాళ్ళ వెనుక నడుస్తూ వుండిన రాజగోపాల్‌కు తాను బయటనే వుండడం క్షేమమని తోచింది. "నేను బయటనే వుంటాను కల్యాణీ" అన్నాడు అతను. "మీరు త్వరగా ఏదో ఒకటి తేల్చండి."

ఇద్దరూ లోపలికి పోయినారు. కల్యాణి టేబుల్ దగ్గర గోడ కానుకొని నిలబడింది. సుబ్బరామయ్య తలుపు మూసి గడె వేసినాడు.

"అదేమిటి మామా? గడె యెందుకు వేస్తున్నావు?" ఆమె ఆందోళనగా అడిగింది.

వాకిలి దగ్గరనే నిలబడి అతను పరుషంగా అన్నాడు: "ఇంక చెప్పు — నీకేమైనా తల చెడిందా? పెండ్లి కావలసిన పిల్ల చేయవలసిన పనేనా యిది?"

అతను చేసిన మోసం ఆమెకు హఠాత్తుగా, పిడుగుపాటుగా అర్థమైంది — భయంకరంగా, హృదయ విదారకంగా అర్థమైంది. "మామా" అంటూ కేక వేసి తలుపు దగ్గరకు పరుగెత్తింది. గడె తీయడానికి ప్రయత్నించింది,

సుబ్బరామయ్య ఆమె చేతులు పట్టుకొని లాగినాడు. "నన్నె పోనీ, నన్ను వదలు" అని పెనగులాడుతున్న కళ్యాణిని లాక్కొని వచ్చి

మంచం మీద పడవేసి, కోపమూ అసహ్యమూ కూడిన కంఠంతో అన్నాడు : "నీవు చేసే తప్పుడు పనికి సహాయం చేయాలా ! నీకు బుద్ధి లేకపోతే నాకూ లేదనుకున్నావా ? అసలు నీవు చేసిన పని ఏమైందీ నీకు తెలుసునా ? ఒక గంటలో పెండ్లి కావలసిన దానవు యెవరితోనో లేచిపోతే మీ అమ్మానాన్నా ఏమౌతారనుకున్నావు ! ఇప్పుడీ సంగతి పెండ్లి వాళ్ళకు తెలిస్తే నీ బ్రతుకు ఏమౌతుందనుకున్నావు !"

కల్యాణి మంచం మీద కూర్చొని తడి కన్నులతో అతని వైపు చూసింది, అతని ముఖం అసహ్యంగా కనపడింది. ఆకారం మూర్తీభ వించిన మూర్ఖత్వంగా కనపడింది. కన్నీళ్లు కారుస్తూ బొంగురుపోయిన కంఠంతో ఆమె అన్నది : "నీ వింత మోసం చేస్తావనుకోలేదు."

"తప్పుడు పని చేయడంగాక నన్నే మోసం అంటున్నావా ?

"నేనేమీ తప్పుడు పని చేయడం లేదు. నా కిష్టం లేని పెండ్లి చేసుకొమ్మని బలవంతం చేస్తున్నారు. నా కాళ్ళు కట్టి గంగలో త్రోయ డానికి సిద్ధపడుతున్నారు. మీదే తప్పుడు పని."

"ఎందు కిష్టం లేదు ? ఈ పెండ్లి కొడుక్కు ఏమి లోటుందని ? నీ రాజగోపాల్ కంటె అతనెందులో తీసిపోయినాడని ? నిన్ను లేపుక పోవడానికి వచ్చిన యీ వెధవకు రైలు చార్జీల కైనా గతిలేదు."

"మామా" కల్యాణి గట్టిగా అరచింది. "నీ వెవరినీ మాటలన నక్కరలేదు. నిన్ను నమ్ముకొని వచ్చినందుకు నీవు చేసింది చాలు. ఏది కోరినా చేస్తానని నమ్మించి గొంతులు కోసే కిరాతకునివి."

సుబ్బరామయ్య వికటంగా నవ్వుతూ మంచం దగ్గరికి వచ్చినాడు. "నీ మేలు కోరే వాళ్ళే నీకు కిరాతకులుగా కనపడుతున్నారు. నేను కిరాత కునే ఐతే నిన్నా వెధవ వెంట పంపి నీ జీవితం సర్వనాశనమైనప్పుడు

సంతోషించి వుందును. నీమీద అభిమానం వుండబట్టే, నీ మేలు కోరి యీ పని చేస్తున్నాను."

"అభిమానం !" దుఃఖభారంతో ఆమె కంఠం గజగజ వణికింది. కన్నీళ్ళు ధారగా కారుతున్నాయి. "నీవు చూపించిన అభిమానం జీవిత మంతా జ్ఞాపక ముంటుంది. నీ పేరు తలచుకొని ఏ రైలు కిందనో పడి చస్తాను," అరచేతులతో ముఖం కప్పుకొని తలవంచి ఆమె భోరున ఏడ్చింది.

సుబ్బరామయ్య హృదయంలో ఏ మూలనో జాలి పొడసూపింది. మెల్లగా అతనన్నాడు : "ఎందుకమ్మా అంత దుఃఖం ? రైలు క్రింద పడి చావ వలసిన ఖర్మ నీకే మొచ్చింది ? రఘుపతిని చేసుకుంటే నీకే లోటూ వుండదు. నీ జీవితం సుఖంగా జరుగుతుంది."

కన్నీళ్ళతో తడిసిన ముఖమెత్తి కల్యాణి దీనంగా అడిగింది : "బల వంతపు పెండ్లి చేసుకుంటే సుఖపడతారా మామా ?"

"బలవంతం ఏముందమ్మా ? నీ సుఖం కాక మేము కోరే దేముంది ?"

"సుఖం ! ప్రేమలేని పెండ్లి చేసుకొని ఏమని సుఖపడమంటావు!"

సుబ్బరామయ్య అపహాస్యంగా చిరునవ్వు నవ్వినాడు. "పిచ్చి పిల్లవు గాకపోతే ప్రేమ ఏమిటమ్మా ! పడుచుదనపు కోర్కెలూ, పసి తనపు భావాలూ ! పెండ్లి చేసుకొని నీ భర్తను ప్రేమించు – నీ యిష్టం వచ్చినంత ప్రేమించు, యెవరొద్దన్నారు ?"

కల్యాణి మళ్ళీ తలవంచుకుంది. అతని మాటలు ఆమెకు జుగుప్స కలిగించినాయి. అతనితో మాట్లాడడమే అసహ్యమనిపించింది. ఎంత నీచంగా మాట్లాడుతాడు ! ఎంత అసహ్యమైన మనిషి ! చిన్నప్పటినుండి

మామా అంటున్న మనిషి ఎంత నీచుడు! తన అభిమానమంతా క్రుమ్మరించిన మనిషి ఎంత అల్పుడు! తన విశ్వాసమంతా మూటగట్టి పెట్టిన మనిషి ఎంత క్షుద్రుడు! తన కిన్నాళ్లూ ఎందుకు తెలియలేదు? మనిషేనా యితను? మనుషులందరూ యింతేనా? ఆమెకు మనుషులందరూ అసహ్యంగా కనపడినారు. లోకమే జుగుప్సాకరమైంది. తన ఆశలింక ఫలించవని నిరాశ క్రమ్మింది. ఎదుటి మనిషిమీద అసహ్యంతో, తన భవిష్యత్తును గురించి నిర్వేదంతో, నిట్టూర్పులు నిగిడిస్తూ, తలవంచుకొని, కర్కశమైన కంఠంతో పలికింది: "నా ప్రేమను నీవింత చులకనగా చూస్తావనుకోలేదు. ప్రేమంటే నీకింత అసహ్యమైన అభిప్రాయాలున్నా యనుకోలేదు. చదువుకున్నవాని వనుకున్నాను. అంతో యింతో సంస్కారం వుంటుం దనుకున్నాను. నా ప్రేమ నీకు అర్థమౌతుందనుకున్నాను. సానుభూతి చూపిస్తావనుకున్నాను. సహాయం చేస్తావనుకున్నాను. నా కోసం ఏ పనై నా చేస్తావనుకున్నాను. నా సుఖం కోసం ఎంత త్యాగమైనా చేస్తా వనుకున్నాను."

సుబ్బరామయ్య తీవ్రంగా జవాబు చెప్పినాడు: "నీ కోసం కాకపోతే యిదంతా ఎవరికోసం అనుకున్నావు? అర్థరాత్రి పూట నీతో యిన్ని మాటలు పడుతున్నది ఎవరికోసం అనుకున్నావు? నీవు చెడిపోతుంటే చూడలేక అడ్డుపడడం ఎవరికోసం అనుకున్నావు? నీవు ఏ చిల్లర వెధవతోనో లేచిపోతుంటే బాధపడడం ఎవరికోసం అనుకున్నావు?

కల్యాణి ఉద్రేకంగా లేచి నిలబడింది. "నీ వెవరినీ చిల్లర వెధవ లన నక్కరలేదు. చిల్లర వెధవలు ఎవరైందీ తెలుస్తూనే వుంది."

"తెలుస్తూనే వుంది. చిల్లర వెధవ కాకపోతే, పెండ్లి కావలసిన పిల్లను సర్వనాశనం చేయడానికి పూనుకుంటాడా? నీ నగలమ్ముకొని

బ్రతకడానికి సిద్ధపడిన నీచుడు! రైలు ఛార్జీల క్కూడా గతిలేని వెధవ!"

కల్యాణి రోషంతో బుసకొట్టుతూ తన రాజాను సమర్థించించి. "నీకు మర్యాదగా మాట్లాడడం కూడా చేతకాదు. రాజా నీయంత నీచుడేమీ కాదు. నా నగలమ్ముకొని బ్రతకవలసిన కర్మ అతనికేమీ లేదు. ఈ పెండ్లి ఖాయమైనప్పటి నుండి నన్ను తప్పించుకొని తిరుగుతున్నాడు. ఎన్నిసార్లు పిలవనంపినా రాలేదు. కడసారైనా కనపడమని వుత్తరం వ్రాసి పంపితే యిప్పుడు వచ్చినాడు. పెండ్లి చేసుకొని సుఖపడమని చెప్పినాడు. పెండ్లి కాబోతున్నదానికి కళంకం కలిగించడం తన కిష్టంలేక రాలేదన్నాడు. నేనెంతో బలవంతం చేస్తేగాని నావెంట రావడానికి యిష్ట పడలేదు. ఈ పెండ్లి జరిగితే ఆత్మహత్య చేసుకుంటానని కండ్ల నీళ్ళు పెట్టితే అప్పుడు ఒప్పుకున్నాడు." ఆమె హృదయంలో క్రమంగా రోషం తగ్గి వేదన హెచ్చింది. "డబ్బు కొరకు ప్రయత్నం చేయడానికి యిద్దరికీ వీలు చిక్కలేదు. డబ్బు లేదని కూడా రాజా వెనుకాడినాడు. ఏ సహాయ మైనా చేయడానికి మా మామ వున్నాడని నిన్ను నమ్ముకొని వచ్చినాను. ఇటువంటి విషయాలలో పెద్దవాళ్ళ నెవరినీ నమ్మకూడదని రాజా యెంత చెప్పినా నా బుద్ధి గడ్డి తినింది. టిక్కెట్లు లేకపోయినా రైలెక్కి పోదా మన్నాడు. రాజా ఎంత చెప్పినా వినకుండా నిన్ను నమ్మి వచ్చినందుకు...." ఆవేదన అధికమై ఆమెకు నోరు తడబడింది. కన్నీళ్ళు జాలుగా కారు తున్నాయి. రాజాను తలచుకొని, రాజా మీద తన కున్న ప్రేమ తలచు కొని, సుబ్బరామయ్య చేసిన మోసం తలచుకొని, తనకు కలిగిన పరాభవం తలచుకొని, కడుపులో నుండి కట్టలు త్రెంచుకొని పొంగి వచ్చే దుఃఖం ఆపుకోలేక, వెక్కి వెక్కి ఏడుస్తూ ఆమె మళ్ళీ మంచంమీద కూల బడింది. "నేను సుఖపడడం మీ కిష్టం లేదు. నేను బ్రతకడం మీ కిష్టం లేదు. బ్రతికినంత కాలం మీరు పన్నిన వుచ్చులలో విలవిల

తన్నుకొని చావవలెనని మీ కోరిక. మీ మర్యాదలకు నన్ను గడ్డి తిన మంటున్నారు. మీ ప్రతిష్ఠలకు నన్ను బలిచేస్తున్నారు. మీరు పశువులు. మీ పిల్లలు సుఖపడితే చూసి ఓర్వలేని కిరాతకులు. మీ గౌరవాల కోసం పిల్లలనే బలియిచ్చే రాక్షసులు. పిల్లల ప్రాణాలతో ప్రతిష్ఠలు నిలబెట్టు కొనే పాపాత్ములు."

సుబ్బరామయ్య నిశ్చేష్టుడైనాడు. ఇంత ఆవేదన, ఇంత ఆవేశం అతనెన్నడూ చూసి యెరగడు. ఒక క్షణం పాటు అతనికి మనసు కరిగింది. ఆమె కోరినట్లు నడచుకుందామన్నంత కనికరం కలిగింది. కల్యాణికి యెంత బాధ కలిగింది! తన కల్యాణికి యెంత దుఃఖం కలిగింది! పద్దెనిమిదేండ్లుగా పెరిగిన మమకారం ఉప్పొంగి ఒక క్షణం పాటు హృదయమంతా ఆక్రమించింది. కన్నులు చెమ్మగిల్లినాయి. మరుక్షణంలోనే అతనికి నైతిక బాధ్యతలన్నీ జ్ఞాపకం వచ్చినాయి. నాగరిక సాంఘిక ధర్మాల క్రింద కనికరం అణగిపోయింది. నిత్య జీవిత నియమాల క్రింద మమకారం ముడుచుకపోయింది. ఎన్నడూ అనుభవించని హృదయమధనంతో అతను ఒక నిమిషం సేపు నిశ్చేష్టుడై నిలబడినాడు.

"కల్యాణీ!" కిటికీగుండా రాజగోపాల్ గొంతు వినపడింది. ఇద్దరూ కిటికీ వైపు చూసినారు. "ఇంక లాభం లేదు. మీ నాన్న వస్తున్నాడు." సమాధానం కొరకు యెదురు చూడకుండా రాజగోపాల్ చీకటిలో అదృశ్యమై పోయినాడు. కల్యాణి బిక్క ముఖంతో సుబ్బరామయ్య వైపు చూసింది. సుబ్బరామయ్య తెప్పరిల్లి గబగబా గడె తీసి తలుపులు తెరచినాడు. "ఇకనైనా తెలివి తెచ్చుకొని మర్యాదగా మసలు. ఏ మాత్రం అల్లరి ఐనా నీ జీవితమంతా నాశనమౌతుంది," అని కళ్యాణితో చెప్పి అతను వాకిలి దాటి బయటికి వచ్చి నిలబడినాడు. తరువాత రెండు క్షణాల్లో

పెట్రోమాక్సులైటు తీసుకొని యిద్దరు మనుషులూ, సోమసుందరమూ వచ్చినారు.

2

వీధి చివర విడిది యింట్లో ఆడవాళ్ళు ముహూర్తానికి ముస్తాబౌతున్నారు.

ఒక ప్రక్క పరుపులమీదా, చాపలమీదా పది పండ్రెండు మంది పిల్లలు ఒకరిమీద ఒకరు పడి నిద్రపోతున్నారు. పెండ్లికొడుకు అక్క కమలమ్మ విడిది యింటి నుండి పెండ్లి యింటికీ, పెండ్లి యింటి నుండి విడిది యింటికీ అప్పటికే నాలుగుసార్లు తిరిగి, ఎవరికి అవసరమైన వస్తువులు వాళ్ళకు అందిస్తూ అందరినీ తొందరపెడుతున్నది. ఇంటి ముందరి విశాలమైన వసారాలో ఎడమవైపు కంబడి పరచుకొని పెండ్లికొడుకు తండ్రి తాంబూలం వేసుకుంటూ బంధువులతో కబుర్లు చెప్పుకుంటున్నాడు. మేడమీద నిద్రపోయే వాళ్ళందరూ ఒక గదిలో నిద్రపోగా, మరొక గదిలో కొంత మంది పేకాట ఆడుతున్నారు. పెండ్లికొడుకు రఘుపతి మిత్రుల దగ్గర కూర్చొని పేకాట చూస్తున్నాడు.

కమలమ్మ మరొకసారి అందరివైపూ కలయజూసింది — యింకా యెవరికైనా యేమైనా కావాల్నా అన్నట్లు. పౌడరు డబ్బాలూ, నూనె సీసాలూ, తలపిన్నులూ, ఎవరికీ ఏమీ అవసరమున్నట్లు లేదు. ఎవరి అలంకరణలో వాళ్ళు మునిగి ఎవరూ ఏ పనీ పురమాయించక పోవడంతో, ఆమె నిద్రపోతున్న కూతురు దగ్గరకు పోయింది. "లెయ్యమ్మా, తల దువ్వి జడ వేస్తాను" అంటూ ఆరేండ్ల శారదను చంకలో వేసుకొని దొడ్డి వాకిలి దగ్గర బానలో వున్న చల్ల నీళ్ళతో ముఖం తుడిచింది. శారదకు చివ్వున మెలకువ వచ్చి తల్లి చేయబోయే సింగారాన్ని తీవ్రంగా ప్రతిఘ

టిస్తూ తారాస్థాయిలో యేడుపు ఎత్తుకుంది. శారద ఏడుపు విని రఘుపతి మేడమీద నుండి దిగి వచ్చినాడు. తమ్ముని చూసి కమలమ్మ "యేమి రఘూ, యింకా యిక్కడనే వున్నావా? ఒంటి గంటైనా నిన్ను పిల్చుక పోవడానికి పెండ్లివాళ్ళెవరూ రాలేదా?" అన్నది.

రఘుపతి చేతి గడియారం చూసుకొని "ఒంటి గంట కాలేదులే, యింకా పండ్రెండున్నర కూడా కాలేదు" అంటూ విప్పిన జడలు విరబోసుకొని యెగిరెగిరి యేడుస్తున్న శారదను యెత్తుకున్నాడు.

"ముహూర్తం మించిపోతున్నది. వీళ్ళకు అన్నీ మనమే చెప్పి చేయించవలసినట్లుంది. ఒకసారి పెండ్లి యింటికి పోయి వస్తాను – యింకా ఆలస్యం కాకుండా" అంటూ ఆమె ప్రయాణమైంది.

రఘుపతి ఆమెను వారించినాడు: "యెందుకక్కా, వాళ్ళకు మాత్రం తెలియదూ? ప్రతి దానికీ నీవు అనవసరంగా తాపత్రయ పడతావు."

"సరేలే! యింతలో నీ వీ పిల్లను సముదాయించు. వెంటనే వచ్చి జడ వేస్తాను. మళ్ళీ నిద్రపోతుందేమో పీడపిల్ల – జాగ్రత్తరా," అంటూ ఆమె తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

శారదను యెత్తుకొని రఘుపతి వసారాలోకి వచ్చినాడు. తండ్రీ, మేనమామా, యింకా దగ్గరి దూరపు బంధువులూ వసారాలో మాట్లాడుకుంటున్నారు. రఘుపతి శారదను భుజంమీద పండబెట్టుకొని జోకొట్టుతూ అటూ యిటూ తిరుగుతున్నాడు.

"యింక యీ సంవత్సరం వాన రాదు," రఘుపతి తండ్రి వెంకటరమణయ్య అన్నాడు. "వచ్చేటట్లుంటే పోయిన శనివారం నాడే రావలసింది. వర్షానికి అంత బలమైన ముహూర్తం యింక లేదు."

"పంచాంగాలకేమిలే — బలం వున్ననాడు వాన రాకపోతే, బలం లేని నాడు రాకూడదా ?" రఘుపతి మేనమామ శేషాచలం అన్నాడు.

"బలం వున్నప్పుడే రాకపోతే, లేనప్పుడెట్లా వస్తుందోయ్ ?" అన్నాడు వెంకటరమణయ్య, బావమరది అజ్ఞానాన్ని అపహాస్యం చేస్తూ.

"మరి అంత బలం వుంటే శనివారం నాడు యెందుకు రాలేదు ?" శేషాచలం సవాల్ చేసినాడు.

"బలం ఉండబట్టే అంతగా మబ్బులు పట్టినాయి. లేకపోతే అదీ లేదు," అన్నాడు ఒక దూరపు బంధువు. అతను ఎవరైందీ రఘుపతికి అర్థం కాలేదు.

"పంచాంగాలు నమ్ముకొని యింతవరకూ యెవరూ బాగుపడలేదు," అన్నాడు యింకొక పెద్దమనిషి తీర్మానంగా. అతని కంఠంలోని నిశ్చితత్వానికి రఘుపతి చిరునవ్వు నవ్వుకున్నాడు.

వెంకటరమణయ్య సమర్థించుకున్నాడు: "మనలో యింత మాత్రం న్యాయం యేడుస్తున్నది! మనం సరిగా లేనప్పుడు పంచాంగాలు మాత్రం సరిగా యెట్లుంటాయి ?" తండ్రి మాటలు పంచాంగాలను సమర్థించడమో, పంచాంగాలు సరిగా నడవకపోవడాన్ని సమర్థించడమో రఘుపతికి అర్థం కాలేదు. అర్థం కాకపోయినా తండ్రి మాటల్లో యేదో నిజాయితీ వున్నట్లు అతనికి తృప్తి కలిగింది.

శారద రఘుపతి భుజం మీదనే నిద్రపోయింది. వసారాలో కుడివైపు కొనన వున్న బెంచీ దగ్గరకు పోయి అతను శారదను పండబెట్టి బెంచీమీద కూర్చున్నాడు. యింతలో మేడమీద నుండి అతని మిత్రుడు సూర్యం దిగి వచ్చి దూరంగా వున్న రఘుపతిని చూసి అక్కడికే వచ్చినాడు.

"యేం సూర్యం, పేకాట విసుగైందా?" అంటూ రఘుపతి అతన్ని పలకరించినాడు.

"అదేం లేదు — డబ్బైపోయింది" అన్నాడు సూర్యం పెదవి విరుస్తూ.

"యివ్వమంటావా ఒక యిరవై రూపాయలు?" రఘుపతి జేబులో నుండి పర్సు తీయబోయినాడు.

"అక్కర్లేదులే" అంటూ సూర్యం శారద కాళ్ళు ప్రక్కకు సర్ది బెంచీమీద కూర్చొని "మరి నీవేం ఒంటిగా కూర్చున్నావే? పెండ్లవుతున్న దని దిగులు పడుతున్నావా?" అన్నాడు హాస్యంగా.

హాస్యానికి రఘుపతి నవ్వుతూ "దిగులెందుకూ?" అన్నాడు.

"ఒంటరి జీవితంలోని బేషరతు ఆనందం అంతమౌతున్నదని."

"అందులో నీవేదో ఆనందం కనిపెట్టినట్లుందే? అందుకేనా నీవింకా పెండ్లి చేసుకోంది?" సరసంగా మిత్రునిమీద నిందమోపి రఘుపతి తన చమత్కారానికి తానే నవ్వినాడు.

ఆ సరసానికి సూర్యం చిరునవ్వు నవ్వుతూ అన్నాడు: "అందరికీ వుండవద్దూ నీ యంత అదృష్టం? బియ్యే పాస్ కాక ముందే పదివేల రూపాయలతో పెండ్లి! సరేకాని — మరి పెండ్లి కూతురు యెట్లుంది? అందంగానే వుందా?"

రఘుపతి ముసిముసి నవ్వులు నవ్వుతూ అన్నాడు: "యింకో గంటలో చూస్తావుగా! చూసిన తర్వాత నీవే చెప్పు యెట్లుందో."

"ఒకరి సర్టిఫికెట్లు నీ కెందుకోయ్!" సూర్యం బిగ్గరగా నవ్వి, అంతలోనే తాను నవ్వడం వసారాలో అవతలి వైపు వున్నవాళ్ళు విన్నా రేమో అని తిరిగి చూసి, మెల్లగా అన్నాడు: "నీకు బాగుంటే సరి,

పెండ్లి కూతురు అందం పెండ్లి కొడుక్కు నచ్చితే సరిపోయింది — మేమంతా యెవరం మధ్యన?"

"ఐనా మీ కండ్లకు యెట్లుందో అని?"

"మా కండ్లతో నీకేం పని! నీవు పెండ్లి చేసుకుంటున్నా వంటే నీ కండ్లకు బాగుందనే అర్థం. అంతగా నీకు సర్టిఫికెట్ కావాలంటే అమ్మాయిని చూడకుండానే వ్రాసియిస్తాను తీసుకో — అద్భుతం, అమోఘం, అపూర్వం, అజేయం అని." సూర్యం పకపక నవ్వినాడు.

రఘుపతి కూడా నవ్వుతూ "చూడకుండానే అంత పెద్ద సర్టిఫికెట్లా!" అన్నాడు.

"ఔను మరి నీ కండ్లకు బాగుందిగా! నీవు ఒప్పుకున్నావు గాబట్టి జగన్మోహినిగా వుంటుందనే నా నమ్మకం."

"జగన్మోహినేం కాదులే — యేదో ఒక విధంగా వుంటుంది. ఐనా జగత్తుకంతా మోహిని ఐతే నాకేం పనికొస్తుందిలే."

ఉలికిపడి సూర్యం హాస్యధోరణి వదలి ఆందోళనగా అన్నాడు: "ఛీ ఛీ — అదేమిటి రఘూ? నేనన్న మాటను నీ వెక్కడికో లాక్కుపోతున్నావు. నేనేమీ తప్పు వుద్దేశంతో అనలేదు."

అనాలోచితంగా తన నోటికి వచ్చిన చమత్కారంలో యిమిడివున్న అనర్థమంతా రఘుపతికి అప్పుడు మెదడు కెక్కింది. ఒక్కసారి మనిషి నిలువునా కంపించి అపస్వరం పలుకుతున్న కంఠంతో తొందర తొందరగా అన్నాడు: "పొరపాటు సూర్యం, నాదే పొరపాటు. ఏదో ధోరణిలో, ఏమంటున్నానో నాకే తెలియకుండా అన్నాను."

యింకేం మాట్లాడడానికీ సూర్యానికి తోచలేదు. యిద్దరూ మౌనంగా వుండిపోయినారు. మౌనం రఘుపతికి దుర్భరంగా వుంది.

ఏదో ఒకటి మాట్లాడడానికి ప్రయత్నించేస్తూ అతనన్నాడు : "నీ సంగతి చెప్పు సూర్యం. యింకా ఎప్పుడు పెండ్లి చేసుకుంటావ్ ?"

"యెప్పుడో ఒకసారి చేసుకుంటాన్లే — తొందరేమొచ్చింది ?"

"ఉద్యోగం కూడా దొరికింది. యింకా ఆలస్యమెందుకు ?"

"చేసుకోకూడదనేం కాదులే, ఏవో ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. ఏదీ కుదరడం లేదు."

"ఏం ? నీకు సరిపోయే వాళ్ళెవరూ దొరకలేదా ?"

"నాకు సరిపోతే మా వాళ్ళకు సరిపోదు. మా వాళ్ళకు సరిపోతే నాకు సరిపోదు."

"మీ వాళ్ళకు సరిపోవడ మేమిటి ? నీకు సరిపోతే చాలదూ ?"

"ఏముందీ — డబ్బే. యేడెనిమిది వేలైనా లేకుంటే మా వాళ్ళు ఒప్పుకోరు."

రఘుపతి అర్ధ నిమిషం ఏమీ మాట్లాడలేదు. తరువాత అన్నాడు : "యెన్నాళ్ళని పెద్దవాళ్ళమీద ఆధారపడతావ్ ? నీవే యెక్కడైనా ఒక అందమైన అమ్మాయిని చూసి చేసుకో."

సూర్యం ఒక క్షణం రఘుపతి ముఖంలోకి చూసి నిదానంగా అన్నాడు : "నీవు మాత్రం డబ్బు లేకుండా చేసుకుంటున్నావా రఘూ ?"

"లేదులే. కానీ మా నాన్న మరీ అంత డబ్బుకు గడ్డితినేవాడు కాదు. నీవైనా ఏదో ఒక విధంగా మీ వాళ్ళను ఒప్పించు. పెద్దవాళ్ళు మన జీవితాలతోనే వ్యాపారం చేయాలని చూస్తారు."

సూర్యానికి యీ సంభాషణ రుచించలేదు. ఉభయులూ బలవంతంగా మాట్లాడుతున్నట్లే అతనికి తోచింది. కొద్ది క్షణాలు మౌనంగా వుండి

అన్నాడు : "మేడమీదికి పోదాం రా రఘూ — అందరూ అక్కడనే వున్నారు."

ఆ సూచన రఘుపతి ఆహ్లాదంగా స్వీకరించినాడు. "నీవు పద, మా అక్క వస్తూనే యీ పాపను ఆమె చేతికిచ్చి నేనూ వస్తాను."

సూర్యం లేచి మేడమీదికి పోయినాడు. అతను పోయినందుకు రఘుపతికి ఒక వైపు తృప్తిగానే వుంది — గుండె మీద నుండి ఏదో బరువు తగ్గినట్లు. మరొకవైపు పశ్చాత్తాపంగా వుంది — ఆ బరువుకు తానే కారణమన్న జ్ఞాపకంతో. దిగులుగా, అస్పష్టమైన ఆలోచనలతో అట్లే బెంచీమీద కూర్చొని వున్నాడు అతను. అవతల వైపున అతని తండ్రీ, మేనమామా, తక్కిన వాళ్ళూ ఏదో మాట్లాడుకుంటూనే వున్నారు. వాళ్ళ మాటలేమీ అతని చెవికెక్కనే లేదు.

కమలమ్మ పెండ్లి యింటి నుండి వేగంగా వచ్చి వాకిట్లో నిలబడి "నాన్నా, యిటు రా" అని తండ్రిని పిలిచింది. వెంకటరమణయ్య తీరికగా లేచి తాంబూలం ఉమ్మేసి, జరీపంచ సవరించుకుంటూ, లోపలికి పోయినాడు. లోపల ఒకమూల ఎవరూ లేనిచోట కమలమ్మ నిలబడింది. వెంకటరమణయ్య ఆమె దగ్గరికిపోయి "ఏమిటమ్మా?" అన్నాడు.

కమలమ్మ తండ్రికి దగ్గరగా ఆనుకొని వచ్చి, అతని చెవి దగ్గర నోరు పెట్టి, ఉద్వేగం నిండిన కంఠంతో, మెల్లగా చెప్పింది : "పెండ్లి కూతురు కనిపించలేదు."

"పెండ్లికూతురు !" వెంకటరమణయ్య ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరి ఐనాడు. "ఏమిటమ్మా? ఎవరన్నారు?"

"ఒక రనడమేమిటి నాన్నా — నేను చూసి వస్తుంటేను! ఈ పాడు సంబంధం మన పాలిటికే వచ్చి పడింది!"

వెంకటరమణయ్య కూతురు మీద విసుక్కున్నాడు. "సంబంధాని కేమైందీ యిప్పుడు? వాళ్ళే ఖర్చులు పెట్టుకొని పదివేలు యిస్తున్నారు."

కమలమ్మ ఆవేశంతో గొంతు పెచ్చింది. "పాడు పదివేలు! పిల్ల సంగతి చూడు నాన్నా ముందు. చెడిన పిల్ల పది లక్షలు తెస్తే మాత్రం ఎందుకు?"

"ఛీ! ఏం మాటలవి!" కూతురుమీద అతను మండిపడినాడు. "మనం చేసుకోబోయే పిల్లమీద మనమే నిందలు వేయడం!"

"యింకా నిందలేమిటి నాన్నా? మనకీ సంబంధం వద్దేవద్దు. రైలు దొరుకుతుందేమో విచారించు — వెంటనే వెళ్ళిపోదాం."

"ఏమిటమ్మా — నీకేమైనా తల చెడిందా? పెండ్లికూతురు కనిపించక యెక్కడపోతుంది!"

కమలమ్మకు విసుగూ, కోపమూ, తండ్రి తన మాట నమ్మలేదనే బాధా, అన్నీ ఒక్కసారి కలిగినాయి. "యెక్కడ పోయిందో నాకేం తెలుసు? పోయేవాళ్ళందరూ నన్నడిగే పోతారేం? పిల్ల కనిపించలేదని తండ్రి వెదకడానికి పోయినాడు. తల్లి ఏడుస్తూ మూల కూర్చున్నది."

వెంకటరమణయ్యకు ఏమనడానికీ తోచలేదు. "ఏమిటో నేను విచారించుకొని వస్తానుండు," అని అతని అంటుండగానే, రఘుపతి శారద నెత్తుకొని వాళ్ళున్న చోటికి వచ్చినాడు. ఆందోళనగా వున్న తండ్రి ముఖమూ, చిరచిరలాడుతున్న అక్క ముఖమూ చూసి అతను "ఏమిటక్కా?" అని కమలమ్మను ప్రశ్నించినాడు.

ఆమె దూకుడుగా జవాబు చెప్పింది: "ఇంకా ఏమిట్రా, పెండ్లి కూతురు కనిపించడం లేదు."

రఘుపతికి విషయం ఏమీ అర్థం కాలేదు. తన అక్క ఎప్పుడూ

అతిశయంగా ఆవేశాలు ప్రదర్శిస్తుందని అతనికి తెలుసు. అతను తేలికగా అన్నాడు : "కనిపించక ఏమైంది ?"

అతని నిర్లక్ష్యానికి కమలమ్మకు ఒళ్ళు మండి, ఆవేశం రెట్టించింది. "ఏమైందో నాకేం తెలుసు ? ఎవరితోనో లేచిపోయి వుంటుంది."

రఘుపతికి నోట మాట రాలేదు. వెంకటరమణయ్య తీవ్రంగా "ఏమిటా పిచ్చి కూతలన్నీ ?" అంటూ కూతురును మందలించి, "నేను కనుక్కొని వస్తానుండండి. ఒరేయ్ రఘూ, మీ అక్క నోరు జాగ్రత్త! అల్లరి ఔతే ఎవరికి అవమానం అయ్యేది కూడా ఈ మనిషికి జ్ఞానం లేదు." అని బయటికి పోయినాడు.

తండ్రి పోతూనే రఘుపతి బిక్కముఖం వేసుకొని "ఏమిటక్కా ?" అని దీనంగా ప్రశ్నించినాడు.

తమ్ముని ముఖం చూసి కమలమ్మకు దుఃఖం వచ్చింది. "ఏమిటో నాకు మాత్ర మేం తెలుసురా ? ముహూర్తానికి ఆలస్యమౌతున్నదని పెండ్లి యింటికి పోయినాను. పెండ్లికూతురు కనిపించలేదని ఆడవాళ్ళందరూ గుంపులు గుంపులు చేరి గుసగుస లాడుకొంటున్నారు. తండ్రి వెదకడానికి పోయినాడని అన్నారు. ఈ మాట అన్నందుకే నాన్నకు నా మీద అంత కోపం ! ఎటువంటి సంబంధం చేసుకోవలసి వచ్చిందిరా మన యోగ్యతకు !" కమలమ్మ పైట చెరగుతో కండ్లు తుడుచుకుంది.

రఘుపతి ఏమీ పలకలేదు. తల వంచుకొని దిగులు ముఖంతో మౌనంగా వున్నాడు. మళ్ళీ కమలమ్మే అన్నది : "మనకీ సంబంధం వద్దు రఘూ, పెత్తనం చేసేటప్పుడు నన్నైనా పిలవకపోతిరి. ఆడవాళ్ళ సంగతులు ఆడవాళ్ళకు తెలుస్తాయిగానీ, మీకేం తెలుస్తాయి ? ఇప్పుడైనా మించిపోయింది లేదు. ఈ పిల్లను చేసుకోనని నాన్నతో కచ్చితంగా చెప్పేసెయ్."

రఘుపతి తల యెత్తి ఒక క్షణం అక్క ముఖంలోకి చూసినాడు. మళ్ళీ తల దించుకున్నాడు. పెండ్లికూతురు లేచిపోయింది! లేచిపోయిందని తన అక్కకూడా స్పష్టంగా అనడం లేదు. వేయరాని అభాండం మాత్రం ఒకటి వేసి నిశ్చింతగా కండ్ల నీళ్ళు పెట్టుకుంటున్నది. అక్క మాటలు సంపూర్ణంగా నిజమనీ అతనికి నమ్మకం లేదు. సంపూర్ణంగా అబద్ధమను కోడానికీ ఆధారం లేదు. నిజమా అబద్ధమా అని వితర్కించుకోడానికి కూడా అతని బుద్ధీంద్రియానికి స్థిరత్వం నశించింది. హద్దులు కనపడని ఆవేదన కటిక చీకటి వలె మనసంతా ఆక్రమించి ఆలోచన శక్తిని అణచి పెట్టింది. తన కాబోయే భార్య లేచిపోయింది! మర్మాంతకమైన ఆ మాట హృదయమంతా దహిస్తున్నది. నిశ్శబ్దంగా అతను భుజంమీద నిద్రపోతున్న శారదను కమలమ్మ చేతికి అందించి, వెనుదిరిగి పోబోయి నాడు. కమలమ్మ ఆత్రంగా ఒకడుగు ముందుకు వచ్చి "ఏమంటావ్ రఘూ? మనకేం పిల్లలే కరువైనారా? ఇంతకంటే మంచి సంబంధం నీకు మూడు రోజుల్లో దొరుకుతుంది," అన్నది.

రఘుపతి కమలమ్మ వైపు చూడకుండా, మెల్లగా బయటికి నడిచినాడు.

వసారాలో తండ్రీ మేనమామా తప్ప తక్కిన వాళ్ళంతా అట్లే కూర్చొని వున్నారు — ఏదో లోకాభిరామాయణం మాట్లాడుకుంటూ. రఘుపతి వసారా దిగి వీధిలోకి వచ్చి నిలబడినాడు. పెండ్లి యింటివైపు నుండి కుక్కలు మొరుగుతున్న ధ్వని సన్నగా వినపడుతున్నది. వూరి బయటికి ముఖం తిప్పి అతను పది అడుగులు నడచినాడు. చలిగాలి ఎదురుగా వచ్చి ముఖంమీద ముసరింది. కండ్లు మూసుకొని ఒక్కసారి చల్లనిగాలి ఊపిరితిత్తుల నిండా పీల్చుకున్నాడు. మరి నాలుగు అడుగులు ముందుకు వేసినాడు, వసారాలోని లైటు వెలుతురును దాటి చీకటిలో

ప్రవేశించినాడు, రోడ్డు మీద గుంతలో కాలుపడి ఒళ్ళంతా అదిరింది. అతను మరి నాలుగడుగులు ముందుకు వేసినాడు. రోడ్డు ప్రక్కన పండుకొని వున్న కుక్క ఉలిక్కిపడి లేచి బౌ అంటూ మొరిగింది. వీధి చివర రోడ్డుకిరువైపులా వున్న పూరి గుడిసెలు దాటి అతను వూరి బయటికి వచ్చినాడు, పరధ్యానంగా ఒక ఫర్లాందు దూరం నడచినాడు.

రోడ్డుకు పది గజాల దూరంలో పెద్ద వేప చెట్టు చీకటిలో కొమ్మలు విరబోసుకొని బ్రహ్మరాక్షసివలె వుంది. రోడ్డు వైపు ఉన్న కొమ్మ క్రింద అతను నిలబడినాడు. చలిగాలి బస్సున వచ్చి కొమ్మలలో దూరి దీనంగా మూల్గింది. కొమ్మ చివర వున్న మంచు బిందువు ఒకటి అతని ముఖంమీద పడింది. వెలుగుతున్న నక్షత్రాలను లెక్కచేయకుండా నల్లని ఆకాశం తీవిగా దిక్కులన్నీ ఆక్రమించింది. నెత్తిమీద కృత్తికారాశి మినుకు మినుకు మంటూ ఎవరినో వెక్కిరిస్తున్నది. వెనుక వైపు మరొక చెట్టుమీద నుండి గూబ మూల్గింది. దూరాన నక్కలు జాలిగా అరుస్తున్నాయి. చలిగాలి మరొకసారి అతని కుడి చెంపమీద పొరాడి గగుర్పాటు కలిగించింది.

రఘుపతి వేపకొమ్మ క్రింద నిశ్చలంగా నిలబడినాడు. అతని హృదయమే స్పందనశక్తి కోల్పోయినట్లుంది. బాధకూ దుఃఖానికీ అతీత మైన వేదన ఏదో దేహమంతా వ్యాపించినట్లుంది. ఆలోచనలు గుంపులు గుంపులుగా గంద్రగోళంగా పెనవేసుకొని, సుడులు తిరిగి మనసంతా కలయబెట్టి కల్లోలం చేస్తున్నాయి.

పెండ్లికూతురు లేచిపోయింది. తానసలు పెండ్లి చేసుకోవాలనే అనుకోలేదు. లేచిపోయిందో లేదో, నింద మాత్రం వచ్చింది. పిల్లను చూపి రమ్మన్నాడు తండ్రి. తాను చూపి వచ్చి బాగానే వుందన్నాడు.

లేచిపోతూ అనవసరంగా తన మెడకు తెచ్చిపెట్టింది. తండ్రి పెండ్లి ప్రయత్నం చేస్తూ వుంటే అభ్యంతరం చెప్పవలసిన కారణం తనకేమీ కనబడలేదు. యెవరి వెంట లేచిపోయిందో? బియ్యే పాసై పెద్ద ఉద్యోగం చేస్తాననుకున్నాడు చిన్నప్పుడు. పెండ్లి కూతుర్లు లేచి పోతారని తన కప్పుడు తెలియదు. తానింక బియ్యే పాస్ కాలేదు. పెద్ద వుద్యోగం వుంటే పెండ్లికూతురు లేచి పోదేమో? నగలతో కలిసి పదివేలిస్తారని తండ్రి అన్నాడు. నగలతో కూడా లేచిపోయిందేమో? లేవదీసుక పోయిన వాడు బియ్యే పాసైనాడేమో? మార్చి పరీక్షకు పోదునా వద్దా అని కొత్త పెండ్లి కూతురును అడుగుదామనుకున్నాడు. లేచిపోయే పెండ్లి కూతురు బొమ్మనే సలహా చెప్పుతుంది. చెప్పినా తాను వినడు. తన కసలు బియ్యే పాసౌతాననే నమ్మకం లేదు. పెండ్లి కూతురు స్కూల్ ఫైనల్ పాసైంది. స్కూల్ ఫైనల్ పాసైతే లేచి పోతారు. బియ్యే పాస్ కాకుంటే లేచిపోతారు. అందంగా వున్నవాళ్లు లేచి పోతారని అనుకునే వాడు. తన పెండ్లి కూతురు జగన్మోహిని కాదని సూర్యంతో అన్నాడు. సూర్యం చివుక్కుమన్నాడు. అంత అందంగా లేకున్నా యింగ్లీషు చదువు వచ్చునని సంతోషించినాడు. యింగ్లీషు చదువు లేచి పోయింది. తన అక్కకు ఇంగ్లీషు చదువు రాదు. లేచిపోయిన యింగ్లీషు చదువు తన అక్కకు రాదు. సూర్యంతో లేచిపోయి వుండినా బాగుండును. తన అక్క లేచిపోయినా బాగుండును. తన అక్క సూర్యంతో ....

ఛీ! రఘుపతి తల విదలించుకున్నాడు. యిదేమిటి? అర్థంలేని ఆలోచనలు! దరిద్రపు ఆలోచనలు! ఆలోచనల గుప్పిటి నుండి తప్పించు కోడానికి అతను చెట్టు చెట్టూ తిరిగినాడు. చెట్టు క్రింది చీకటిలో రాయి తగిలి కాలు జిల్లుమన్నది. నిలబడి వూరివైపు చూసినాడు. రోడ్డువైపు నడచినాడు. లేచిపోయిన పెండ్లి కూతురు కొరకు వెదకుతుంటారు.

దిక్కు దిక్కులా వెదకుతుంటారు. వెదకుతూ వెదకుతూ యీవైపుకు వచ్చి తన్ను చూస్తారు. తన్ను చూసి తనతోనే లేచిపోయిందనుకుంటారు. అనుకున్న వాళ్ళ అవివేకానికి అతనికి నవ్వు వచ్చింది. లేచిపోయిన పెండ్లి కూతురు వెదకితే దొరుకుతుందా? దొరక్కుండా యెక్కడ దాచి పెట్టుకుందో? యీ వేప చెట్టు చాటున వుందేమో? అతను రోడ్డు మీద నిలబడి చెట్టువైపు చూసినాడు. యిందాకా తాను చూసిన చెట్టే అది. అక్కడ లేదు. వుంటే తనకు కనపడదూ? తనకు కనపడితే యేమం టుందో? వదలిపెట్టమని ప్రార్థిస్తుంది. తాను వదలిపెట్టడు. పెండ్లి కూతురును యెవడైనా వదలి పెడతాడా! తన అక్క ఐతే వదలిపెట్టమం టుంది. అక్కను వదలిపెట్టవచ్చు. కానీ పెండ్లికూతురును యెవడైనా వదలి పెడతాడా! అక్కను బావ వదలిపెడతాడు. తాను వుంచుకుంటాడు. అక్కనూ పెండ్లికూతురునూ యిద్దరినీ వుంచుకుంటాడు.

ఛీ! ఆలోచనల వైపరీత్యానికి అతనికి భయం కలిగింది. యెంత భయంకరమైన ఆలోచనలు! యెంత అమానుషమైన ఆలోచనలు! యెక్కడి నుండి వస్తున్నా యీ ఆలోచనలు! యింత కల్మషం తన మనసులో యెక్కడ వుంది? ఆలోచనల సుడిగుండం నుండి బయట పడడానికి అతను రోడ్డు వెంట వేగంగా నడచినాడు. యెవరో తరుము కొని వస్తున్నట్లు మరింత వేగంగా నడచినాడు. నాలుగు ఫర్లాంగులు నడిచేటప్పటికి ఒళ్ళు వేడెక్కింది. నిలబడి ఆయాసం తీర్చుకున్నాడు. చలిగాలి సుఖంగా వుంది. పది నిమిషాలలో మనసు కుదుటబడింది. తన కెందుకు యిన్ని ఆలోచనలు? పెండ్లికూతురు లేచిపోతే తనకెందుకు బాధ? తాను హాయిగా మరొక పెండ్లికూతురును చేసుకుంటాడు — అంతే. లోకంలో పెండ్లి కూతుర్లే కరువైనారా? యీ ఆలోచనతో అతనికి సంపూర్ణంగా మనశ్శాంతి యేర్పడింది. పెండ్లి కూతురు వుంటే పెండ్లి

చేసుకుంటాడు. పెండ్లికూతురు లేకుంటే పెండ్లి చేసుకునే ప్రశ్నే లేదు. అతనికి ఆశ్చర్యమైంది, సమస్య యింత సులభంగా తెగిపోయినందుకు. యింతసేపూ యిన్ని ఆలోచనలు యెందుకు వచ్చినట్లు ! తన అవివేకానికి తానే నవ్వుకుంటూ అతను మెల్లగా వూరి దారి పట్టినాడు.

రఘుపతి విడిది యింటి దగ్గరికి వచ్చేటప్పటికి అతని తండ్రీ మేనమామా అతని కోసమే ఆందోళనగా వెదకుతూ వుండినారు. అతను కనపడుతూనే "యెక్కడనోయి వుంటివిరా యింతసేపు ?" అంటూ వెంకటరమణయ్య గట్టిగా కేకలు వేసినాడు.

"యిప్పుడెందుకు బావా యింకా అరవడం ?" అని శేషాచలం బావకు సర్ది చెప్పి, రఘుపతిని యింట్లోకి పిల్చుకొని పోయినాడు. వెంకటరమణయ్య వాళ్ళను వెంబడించినాడు. ముగ్గురూ కలిసి దొడ్డి వాకిలి దాటి యింటి వెనుక బయలులో గోడప్రక్కన చేరినారు.

యేదో విశేషముందని రఘుపతికి మళ్ళీ మనసులో ఆందోళన ప్రారంభమైంది. వాళ్ళు చెప్పిందాకా మౌనం ధరించలేక "పెండ్లికూతురు యేమైంది మామా — దొరికిందా ?" అని మామను ప్రశ్నించినాడు.

సంభాషణ యెట్ల ప్రారంభించవలసిందీ అర్థంకాక అవస్థపడుతూ వుండిన శేషాచలం ఆ ప్రశ్నకు వెంటనే సమాధానం చెప్పినాడు. "పెండ్లికూతురు యేమవుతుందిరా ? యింట్లో వుంది. ముహూర్తానికి అంతా సిద్ధంగా వున్నారు. త్వరగా పోదాం పద."

"ఐతే పెండ్లి కూతురు కనిపించ లేదన్నది అబద్ధమేనా ?" రఘుపతి ఆశగా మామ వైపు చూసినాడు.

వెంకటరమణయ్య కొడుకును కసరుకున్నాడు. "అవన్నీ యిప్పుడెందుకు రా ? త్వరగా పోదాం రా,"

తండ్రి కోప కారణం రఘుపతికి అర్థం కాలేదు. ఆశ్చర్యంతో అతను వెంకటరమణయ్య ముఖంవైపు చూసినాడు. తనను యెందుకు యిక్కడికి పిల్చుక వచ్చినారు — ఏదో రహస్యం వున్నట్లు ?

"ఉండు బావా — ఉన్న విషయం చెప్పడం మంచిదిగాదా. వీడేం పసిపిల్లవాడా ?" శేషాచలం బావను శాంత పరచినాడు. "రఘూ, ఏదో జరిగిపోయింది జరిగిపోయిందనుకో. యిప్పుడవన్నీ అనుకోవడం మంచిది గాదు. యింకా రెండువేలు యివ్వడానికి సోమసుందరం ఒప్పుకున్నాడు. నీకు సమ్మతమే కదూ ?"

"యేమిటి మామా — సరిగా చెప్పు."

వెంకటరమణయ్య కోపంగా సమాధానం చెప్పినాడు. "ఏముందిరా ? ముందు పదివేలు యిస్తామన్నారు గదూ ? యిప్పుడింకా రెండు వేలు యెక్కువ యిస్తున్నారు. యింకేం — డబ్బు చేదా మనకు ?"

"రెండు వేలేమిటి ?" రఘుపతి మామవైపు తిరిగి ప్రశ్నించినాడు. "యెందుకిస్తున్నారు యెక్కువగా ?"

రఘుపతికి వెనుక నుండి కమలమ్మ కంఠం వినపడింది. చీకట్లో ఎప్పుడు వచ్చిందో తమ్ముని వెనుక నిలబడి వుంది ఆమె. "ఎందుకైతే నీ కెందుకు రా ? పెద్దవాళ్ళు చెప్పినట్లు వినరాదూ ?"

ఆమె మాటలలో అతనికి పెండ్లి కూతురు లేచిపోయిందన్న వార్త నిజమో అబద్ధమో తేలలేదు. కానీ అందరూ కలిసి తన్ను యీ పెండ్లికి ఒప్పించడానికి ప్రయత్నం చేస్తున్నారని స్పష్టంగా అర్థమైంది. ఒప్పించడం యెందుకు ? ఎప్పుడో ఒప్పుకున్న పెండ్లికి యిప్పుడు ఒప్పించడం ఏమిటి? అతను దీనంగా కమలమ్మను ప్రశ్నించినాడు : "పెండ్లి కూతురు ఏమైందక్కా ?"

"ఏమౌతుంది రఘూ?" కమలమ్మ తమ్ముని బుజ్జగించింది. "నిన్ను చేసుకోడానికి సిద్ధంగా వుంది. పోదాం పద."

"నీవే అన్నావు — పెండ్లి కూతురు లేచిపోయిందని." అంత దైన్యంలోనూ అతని కంఠంలో ఎక్కడనో ధిక్కారం తొంగిచూసింది.

కమలమ్మ జవాబు చెప్పే లోపలనే వెంకటరమణయ్య కంఠం కస్సుమంది. "ఛా — ఏం మాటల్లా అని? చూటిమాటికీ లేచిపోయిం దంటూ — నీకేం తల చెడిందా? కాబొయ్యే పెండ్లాన్ని గురించి మర్యాదగా మాట్లాడడం కూడా తెలియదా?"

శేషాచలం కంఠం హెచ్చించి వెంకటరమణయ్యను కసురు కున్నాడు. "కేకలెందుకు వేస్తావ్ బావా? నీ కేకలతోనే వాడు మరీ గందరగోళంలో పడుతున్నాడు." తరువాత అతను కంఠం తగ్గించి రఘుతో అన్నాడు: "నేను చెప్తాను విను రఘూ. పెండ్లికూతురు ఎక్కడా పోలేదు. లక్ష్మిదేవి మాదిరి ఒంటినిండా నగలు పెట్టుకొని లక్షణంగా యింట్లో వుంది — ముహూర్తానికి సిద్ధంగా. మనం పోవడమే ఆలస్యం — పది నిమిషాల్లో తలంబ్రాలు పోసుకోవచ్చు."

"ఐతే," రఘు మెల్లగా, జాలిగా ప్రశ్నించినాడు: "లేచిపోవడం అబద్ధమేనా?"

వెంకటరమణయ్య మళ్ళీ కస్సుమన్నాడు. "మళ్ళీ అదే కూతేనా?"

శేషాచలం సానునయంగా రఘుపతి ప్రశ్నకు సమాధానం చెప్పి నాడు: "అబద్ధం రఘూ — పచ్చి అబద్ధం. లేచిపోయిన పిల్లను నీకు కట్టబెట్టి మేమేం మూటగట్టుకుంటాం చెప్పు. నిన్ను మోసం చేస్తే మాకు ఒరిగేదేముంది? నీ సుఖం కాకపోతే మాకింక ఏం కోరిక వుంటుంది?"

ఒక క్షణం నిశ్శబ్దంగా గడిచింది. మెల్లగా, తనలో తాను

మాట్లాడుకున్నట్లు, రఘుపతి ప్రశ్నించినాడు: "రెండువేలు యెక్కువ ఎందుకిస్తున్నారు?"

కమలమ్మ వెనుక నుండి విసుగ్గా అన్నది: "యిప్పుడెందుకురా యీ యక్షప్రశ్నలన్నీ? ఆ మూడు ముళ్ళూ పడితే తరువాత తీరిగ్గా మాట్లాడుకోకూడదూ?"

ఆమెను వారించి శేషాచలం శాంతంగా చెప్పినాడు: "యిటు చూడు రఘూ. రెండువేలు ఎక్కువగా యిస్తున్నారంటే, పెండ్లికూతురు లేచిపోయిందని అనుకుంటున్నావా? చదువుకున్నందుకు యిదేనా ప్రయోజనం? ఏదో సాకు దొరికితే, దాని వుపయోగించుకొని రెండువేలు ఎక్కువగా రాబట్టుతున్నామనుకో. అదైనా ఎవరికోస మంటావ్? నీ కోసం గాకపోతే మా కోసమా? రెండువేలు సులభంగా వచ్చేటప్పుడు ఎందుకు వదలి పెట్టాలని రాబట్టుతున్నాం గానీ, లేకపోతే మేం మాత్రం రెండువేలకు గడ్డి తింటామనుకున్నావా?.... ఏమంటావ్ రఘూ?"

"రెండువేలు ఏమని రాబట్టుతున్నారు?"

"అదే ...." సమాధానం చెప్పలేక శేషాచలం కంఠం ఒక క్షణం తటపటాయించింది. మరుక్షణంలోనే ఆలోచనలతో తేరుకొని సాఫీగా సాగింది. "సుబ్బరామయ్యను చూసినావు గదూ — హైస్కూలు టీచరు — పెండ్లివాళ్ళ యింటికి పొరుగున్నే వున్నాడు. పెండ్లి కూతురు చిన్నప్పటినుండి వాళ్ళింట్లో పెరిగింది, వాళ్ళను అత్తా మామా అంటూ. ఆ సంగతి నీకు తెలుసుగా. పంద్రెండు గంటలప్పుడు పెండ్లి కూతురు వాళ్ళింటికి పోయింది, ఆ సుబ్బరామయ్య భార్యను పిలుచుకరావడానికి. ఇంతలో పెండ్లికూతురుకు స్నానం చేయించాలని ముత్తైదువలు అనడమూ, పెండ్లి కూతురు ఏదీ అంటే ఏదీ అని నలుగురూ అటూ యిటూ చూడ

డమూ, సరిగా ఆ సమయానికి మీ కమలమ్మక్క అక్కడికి పోవడమూ, అన్నీ కలిసి నిష్కారణంగా ఆ అమ్మాయిమీద నింద వేయడానికి అక్కర కొచ్చినాయి. ముగ్గురాడవాళ్ళు కలిస్తే ముల్లోకాలకూ నిప్పు ముట్టిస్తా రనుకో. పాపం, అక్కడ పెండ్లి కూతురు సుబ్బరామయ్య భార్యతో కలిసి అప్పుడే యింటికి వచ్చింది. కానీ ఏం లాభం ? యింతలో మీ అక్క యిక్కడికి వచ్చి పెండ్లి కూతురు కనిపించలేదని పుకారు పుట్టించింది."

వెనుక నుండి కమలమ్మ కంఠం దుఃఖం ప్రకటించింది. "నిజమే రఘూ ! అన్యాయంగా ఆ అమ్మాయిమీద నింద వేసినాను. నా పాపిష్టి నోరు కాల్చినా పూరకుండదు. వచ్చే జన్మలో నేనెన్ని నిందలు మోయ వలసి వస్తుందో?" అంతలోనే ఆమె కంఠం ఉత్సాహంతో పొంగిపోయింది. "యింతకూ నీ అదృష్టం రఘూ, మంచి సంబంధం. పైగా రెండువేలు అనుకోకుండా చేతికి వస్తున్నాయ్."

శేషాచలం మళ్ళీ మెల్లగా ఆరంభించినాడు. "యిప్పుడంతా అర్థ మైందా రఘూ ? మీ నాన్నా నేనూ అక్కడికి పోయి పెండ్లి కూతురు ఏదీ అనేటప్పటికి పాపం సోమసుందరం గుండె నిలిచిపోయినంత పనైంది. ఈ పెండ్లి ఎగిరి పోతుందేమో అని మనిషి నిలువునా అదిరిపోయినాడు. లేచి పోయిందనే నిందవేసి పెండ్లి ఎగరగొడ్తే, ఆ పిల్లకు ఈ జన్మలో పెండ్లయ్యే మార్గమేముంది చెప్పు. అందుకని పాపం అతను వెంటనే యింకో రెండువే లిస్తానన్నాడు. పెండ్లికూతుర్ను గురించి మనకేమీ అనుమానాలు లేవుగా — అందుకని పూరక వచ్చే రెండువేలు ఎందుకు పోగొట్టుకోవాలని వెంటనే ఒప్పుకున్నాం. యింక దీన్ని గురించి నీవేమీ ఆలోచనలు పెట్టుకోవద్దు. సరేనా ?"

కమలమ్మ శేషాచలంకు ప్రోత్సాహం యిచ్చింది. "యింకా

ఆలోచన ఏముంది మామా? రఘుకు ఇంత దూరం చెప్పాలా? మనందరికంటె వీడే తెలివిపరుడు. అదృష్టవంతుడు కూడా. పోదాం పద రఘూ."

రఘుపతి హృదయం చక్రబంధంలో చిక్కుకున్నట్లుంది. తండ్రీ, తోబుట్టువూ, మేనమామా, ముగ్గురూ కలిసి ఏక ముఖంగా తనమీద సామ దాన భేద దండోపాయాలన్నీ ప్రయోగిస్తున్నారు. ఇంత మంది ప్రయోగించే యిన్ని ఆయుధాలను ఒకే సారి ఎదిరించే సాహసంగానీ, సామర్థ్యంగానీ అతని హృదయానికి లేదు. తన దుస్థితిని జూచి అతనికే జాలి కలిగింది. తానొక అమాయకుడైన యువకుడు — అసమర్థుడైన యువకుడు. తన్ను ఒంటరివాణ్ణి చేసి, ఒల్లని పెండ్లికి బలవంతం చేస్తున్నారు. స్వకరుణతో అతని హృదయం ద్రవించిపోయింది. తన భవిష్యత్తును గురించి యెన్నో బంగారు కలలు గన్నాడు. తన జీవితంలో ఏమేమో సాధించగలనని ఊహాసౌధాలు నిర్మించుకున్నాడు. ఆ గాలిమేడ లన్నీ ఒక్క వూపుతో నేలమట్టమౌతున్నాయి. కడకు కళంకంలేని భార్యను పొందే భాగ్యంకూడా లేదు తనకు. చదువుకున్న భార్యతో కలిసి స్వర్గానికి నిచ్చెనలు నిర్మించవచ్చు ననుకొన్నాడు. కానీ, తుదకు ఈ భార్యతో కలిసి నలుగురిలో ముఖమెత్తుకొని తిరిగే అవకాశం కూడా లేదు. తన యోగ్యతకు తనకు పట్టవలసిన దుర్గతి కాదు యిది. గౌరవమూ, మర్యాదా గల కుటుంబంలో పుట్టినాడు. తన తండ్రికి ఏకైక పుత్రుడు. లక్ష రూపాయల ఆస్తికి వారసుడు. బియ్యే చదివినాడు. యీ పెండ్లి కూతురును వెంటబెట్టుకొని పోయి తన వూర్లో తాను ఏమని గౌరవంగా బ్రతగ్గలడు? ఈ పెండ్లి చేసుకొని యీ అత్తగారి వూర్లో మాత్రం తాను ఏమని బజార్లలో తిరగగలడు? ఫలానా సోమసుందరంగారి అల్లుడని అందరూ వ్రేలెత్తి చూపుతారు. లేచిపోయిన పిల్లను చేసుకున్న

వాడని పది మందీ పరిహాసం చేస్తారు. డబ్బుకు గడ్డి తిని యెవనికో మనసిచ్చిన భార్యతో కాపురం చేస్తున్న నీచుడు అని తన్ను వూరందరూ ఆడిపోసుకుంటారు. స్వకరుణతో అతను తన పరిస్థితిని అతి దయనీయంగా ఊహించుకున్నాడు. పెండ్లి కూతురు లేచిపోయినట్లుగానే స్థిరపరచుకున్నాడు. ఈ పెండ్లి చేసుకుంటే తన ఆత్మగౌరవానికి తీవ్రమైన ఆఘాతం చిత్రించుకున్నాడు. యీ ఒల్లని పెండ్లికి ఒప్పించడానికి తన్ను తండ్రీ, మేనమామా, అక్కా బలవంతం చేయడం ప్రపంచ చరిత్రలో ఎవరికీ జరగని అపచారంగా భావించుకున్నాడు. తనకు సంభవించిన ఈ దీనావస్థ ఏ యుగంలోనూ ఎవరికీ సంభవించి వుండదనుకున్నాడు. తన దురవస్థ మీద అతనికి విపరీతమైన జాలి కలిగింది. వివర్ణమైన ముఖమెత్తి తండ్రి వైపూ, మామ వైపూ శూన్యదృక్కులు ప్రసరిస్తూ అతను దీనంగా అన్నాడు : "ఈ పెండ్లి చేసుకొని ఈ వూర్లో ముఖమెత్తుకొని తిరగలేను."

వెంకటరమణయ్య పరుషంగా గద్దించినాడు : "ఏం, తిరగ లేక ఏం రోగమైంది? ఏం తప్పు చేసినావని తిరగలేవు?"

శేషాచలం సానునయంగా అడిగినాడు : "ఈ వూర్లో తిరగవలసిన పని ఏముంది రఘూ? ఈ వూరితో మనకేమి సంబంధమని?"

కమలమ్మ ఉత్సాహంగా సమస్యకు పరిష్కారం సూచించింది "రఘు ఈ వూర్లో వుండవలసిన పని లేకుండా ఏర్పాటు చేస్తాం మామా, ఈ రాత్రికే కార్యం చేయమందాం. ప్రొద్దున్నే పెండ్లికూతురుతో కూడా, అందరం మనవూరికి వెళ్ళిపోదాం. రఘు మళ్ళీ యీ వూరికి రావలసిన పనే వుండదు." తన సూచనకు తానే ఉప్పొంగిపోతూ ఆమె విజయగర్వంతో శేషాచలం వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

శేషాచలంకు ఈ సూచన అమోఘంగా కనపడింది. వెంటనే

అతను వెంకటరమణయ్య వైపు తిరిగి "ఏమంటావ్ బావా ? ఈ రాత్రికే వీలుంటుందా ?" అన్నాడు.

రఘుపతికి అసహ్యం కలిగింది — తన మనసులోని బాధను ఇంత తృణప్రాయంగా చూసిన ఆ ముగ్గురి మీదా అతనికి పరమ అసహ్యం కలిగింది. తన ఆత్మగౌరవాన్ని ఇంత అల్పంగా వెలగట్టిన ఆ ముగ్గురి మీదా అతనికి అంతులేని ఆగ్రహం వచ్చింది. అకస్మాత్తుగా అతని హృదయం ధిక్కారంతో నిండిపోయింది. హఠాత్తుగా "నాకీ పెండ్లి వద్దు" అనే మాటలు అతని నోటినుండి వెలువడినాయి.

వెంకటరమణయ్య అదిరిపడినాడు. ఇంత సేపూ శాంతంగా మాట్లాడుతూ వుండిన శేషాచలం ఆందోళనగా అన్నాడు: "అదేమిటి రఘూ, అన్ని యేర్పాట్లూ ఐన తర్వాత ఆఖరు క్షణంలో వద్దంటే మన మర్యాద ఏమౌతుందనుకున్నావ్ ?"

"నా మర్యాద ఏమౌతుందనుకున్నారు ?"

కమలమ్మ గద్గద కంఠంతో తమ్ముని బుజ్జగించింది: "నా మాట విను రఘూ, యింత మంచి సంబంధం మనకు మళ్ళీ దొరకదు. ఒప్పుకో రఘూ, ఇప్పుడు వద్దంటే ఎంత మందికి తలవంపులుగా ఉంటుందో చూడు."

వెంకటరమణయ్య కోపంతో నోట మాట రాక, బుసకొట్టుతూ, అందరి ముఖాల వైపూ చూస్తున్నాడు.

శేషాచలం జాలిగా అన్నాడు: "మరో రెండు వేలు కూడా యిస్తామన్నారు. ఇప్పుడు కాదనడం బాగుండదు. ఆఖరు క్షణంలో కాదంటే వాళ్ళ గతి ఏమౌతుంది చెప్పు. మనమై అన్యాయంగా ఆ పిల్ల జీవితం నాశనం చేసినట్లౌతుంది."

"అంత అభిమానం వున్నవాళ్ళు అన్యాయంగా అపనిందవేసి రెండు వేలు వసూలు చేయడానికి యెట్ల తయారైనారు?"

రఘుపతి వాదం వెంకటరమణయ్య భరించలేకపోయినాడు. సంభాషణ ధోరణే అతని సహన శక్తిని మించిపోయింది. కోపం పట్టలేక అతను హఠాత్తుగా కొడుకు చేయి పట్టుకొని "మర్యాదగా నోరు మూసుకుని నా వెంట రా — ముహూర్తం మించిపోతున్నది" అంటూ రఘుపతిని చరచరా ఈడ్చుకుంటూ యింట్లోకి వచ్చినాడు. వాకిలికి యిరుపంచలా చెవులు నిక్కబెట్టుకొని వీళ్ళ సంభాషణ వింటున్న పదిమంది ఆడవాళ్ళు గబగబా నలుదిక్కులకూ చెదరిపోయినారు. అందులో ఒక పడుచు ముత్తైదువ నవ్వు పట్టలేక పైట చెరగు నోట కుక్కుకొని ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైంది.

3

కల్యాణి దేవుని గదిలో ఒంటరిగా కూర్చొని వుంది. ఒంటి నిండా ఆభరణాలతో, తళతళలాడే సిల్కు బట్టలతో, వాటితో పొత్తు కుదరని వాడిన ముఖంతో, యేడ్చి యేడ్చి యెరుపెక్కిన కన్నులతో, కల్యాణి గోడకానుకొని దీనంగా కూర్చొని వుంది. మెడలో మంగళసూత్రం మిలమిల మెరుస్తున్నది. తలమీద వెంట్రుకలలో యింకా ఒకటి రెండు బియ్యపు గింజలు ఇరుక్కొని వున్నాయి. బయటి హాలులో నుండి పెట్రోమాక్సు లైటు వెలుతురు వాకిలిగుండా లోపలికి వచ్చి ఆమె కాళ్ళముందు పడుతున్నది. ఎదురుగా దేవుని మూల ఆముదం దీపం మినుకు మినుకు మంటున్నది.

స్పృహలేని మనిషి వలె కల్యాణి నిశ్చలంగా కూర్చొని వుంది — ఎదురుగా వున్న ఆముదం దీపం వైపు తదేకంగా చూస్తూ. శక్తికి

మించిన సమస్యలతో ఆమె మనసు మూగబారిపోయింది; అనుభూతికి అతీతమైన వేదనతో హృదయం అచేతనమైపోయింది. మైకంలో వున్నట్లు ఆమె నిశ్చలంగా పరధ్యానంగా కూర్చొని వుంది.

తన పెండ్లి ఐపోయింది. అంతా కలలో మాదిరి జరిగిపోయింది. ఎవరో తన్ను బలవంతంగా నడిపించుకొనిపోయి పీటలమీద కూర్చోబెట్టి నారు. ఎవరెవరో తన దేహాన్ని ఆజ్ఞాపించినారు. యెవరో తన తల పట్టుకొని మెడలో మంగళసూత్రం కట్టించినారు. ఎవరో తన చేతులు పట్టుకొని పెండ్లికొడుకు తలమీద బియ్యం పోయించినారు. ఎవరో తన్ను పిల్చుకొని వచ్చి ఈ గదిలో కూర్చోబెట్టినారు. తన పెండ్లి ఐపోయింది. అంతా యాంత్రికంగా పరాధీనంగా జరిగిపోయింది. తన అనుమతి లేకుండా తన యిచ్ఛకు వ్యతిరేకంగా తన పెండ్లి జరిగిపోయింది. ఇప్పుడు తానొక భార్య. తన జీవితమంతా మరొకరికి అమ్ముడుపోయింది.

తన జీవితాన్ని ఈ విధంగా అమ్మివేసింది ఎవరు? తనకీ పెండ్లి చేసిం దెవరు? తన యిచ్ఛకు వ్యతిరేకంగా తన్ను జీవితాంతం బంధించింది ఎవరు? ఎవరీ శత్రువులు? ఎవరో ఆమెకు అర్థం కాలేదు. అందరూ తన బంధువులే. అందరూ ఆప్తులే. అందరూ తన్ను ప్రేమించి తన క్షేమం కోరే వాళ్ళే. అందరూ కలిసి తన్ను నట్టేటిలో ముంచినారు. తన కాళ్ళు చేతులు కట్టి నడి సముద్రంలో త్రోసినారు. అందరూ శత్రు వులే. తన బంధువులే తనకు శత్రువులైనారు. తన ఆప్తులే తన పాలిట యమదూతలైనారు, తన్ను ప్రేమించే వాళ్ళే తన జీవితంలో నిప్పులు పోసినారు. తన క్షేమం కోరే వాళ్ళే తన భవిష్యత్తును నాశనం చేసినారు. ఎందుకు? ఎందుకీ విధంగా జరిగింది? తన వాళ్ళే తన కెందుకు శత్రువులైనారు? అందరూ ఎందుకు తనమీద పగబూనినారు? ఎందుకో ఆమెకు అర్థం కాలేదు. అర్థంకాని ప్రశ్నలు, అస్పష్టమైన

ప్రశ్నలు, అనంత వేదనాపూరితమైన ప్రశ్నలు, సమాధానం దొరకని ప్రశ్నలు, తన జీవితాన్ని ముక్కలు ముక్కలు చేసిన ప్రశ్నలు — పద్దెనిమిదేండ్ల పడుచు హృదయం ప్రశ్నల పరంపరతో నిండిపోయింది. తుదిమొదలు లేని ప్రశ్నల రూపం దాల్చిన వేదనతో ఆమె హృదయం నిర్జీవమైపోయింది. మూగగా, మొండిగా, మైకంలో వున్నట్లు, మరో ప్రపంచంలో వున్నట్లు కల్యాణి నిశ్చలంగా కూర్చొని వుంది.

సుబ్బరామయ్య భార్య శాంతమ్మ మెల్లగా వాకిలి దగ్గరికి వచ్చి తొంగి చూసింది. నిశ్శబ్దంగా వచ్చి కల్యాణి దగ్గర కూర్చొని ఆదరంగా అన్నది : "లెయ్యమ్మా, స్నానం చేస్తువుగాని."

కల్యాణి దీనవదనం పైకెత్తి శూన్యంలోకి చూసినట్లు ఆమె వైపు చూసింది. శాంతమ్మ మరింత మమకారంతో "లెయ్ తల్లీ" అంటూ కల్యాణి నెత్తిమీది బియ్యపు గింజలు ఏరివేసి వెంట్రుకలు సవరించింది.

"ఎందుకత్తా ?" కల్యాణి గద్గద కంఠంలో ప్రశ్న కొట్టుకలాడింది. గొంతు సవరించుకొని ఆమె మళ్ళీ ప్రశ్నించింది : "ఎందుకు ?"

"ఈ గంటసేపు మేం చెప్పినట్లు విను తల్లీ. అంతటితో ఐపోతుంది."

"పెండ్లి ఐపోయిందిగా ?"

"ప్రొద్దున్నే నిన్ను మీ అత్తగారి వూరికి పిలుచుక పోతారంట. యీ రాత్రికే...." చెప్పలేక శాంతమ్మ తటపటాయించింది. కల్యాణి నిశ్చలంగా ఆమె ముఖంలోకి చూస్తూనే వుంది. కల్యాణి చూపులు తప్పించుకొని ఆమె మెల్లగా చెప్పింది : "ఈ రాత్రికే కార్యం చేయాలంటున్నారు."

కల్యాణి తల వంచుకున్నది. శాంతమ్మ సానునయంగా ఆమె

గడ్డం పట్టుకొని పైకెత్తింది. కల్యాణి కన్నులలో నీరు చూసి ఆమె ఆందోళనగా "అదేమిటి తల్లీ – అమంగళం ?" అంటూ రెండు చేతులతో కల్యాణి ముఖం పొదివి పట్టుకున్నది. ఆమె వైపు చూడలేక కల్యాణి చూపులు వాల్చింది. కనుకొలుకులలో నుండి నీటి బిందువులు జొటజొట కారినాయి. అదుర్దాగా శాంతమ్మ పైటచెరగుతో కల్యాణి కన్నీళ్ళను తుడిచింది. ధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళతో కల్యాణి ముఖమంతా తడిసింది. అవమానంతో, ఆత్మగ్లానితో గడ్డ కట్టుకుపోయిన కల్యాణి హృదయానికి శాంతమ్మ అనునయ వాక్యాలతో మళ్ళీ చైతన్యం వచ్చింది. మూగవోయిన హృదయంలో మళ్ళీ దుఃఖం సుడులు తిరిగింది. కన్నీరు ఏకధారగా ప్రవహించింది. ఆమెను ఓదార్చే మార్గం తెలియక శాంతమ్మ కల్యాణి తల నిమురుతూ మౌనంగా కూర్చొని వుంది.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచినాయి. అంతలో "యింకా లేవలేదా ?" అంటూ కల్యాణి తల్లి అక్కడికి వచ్చింది. శాంతమ్మ ఉలికిపడి, కల్యాణి చేయి పట్టుకొని "లెయ్యమ్మా" అంటూ లేచి నిల బడింది. ఆమెతోపాటు కల్యాణి కూడా యంత్రంవలె లేచి నిలబడింది. తల్లీ, శాంతమ్మా చెరొక చేయి పట్టుకొని ఆమెను నడిపించుకొని పోయినారు. నీళ్ళు నిండిన కన్నులతో, కబోదివలె ఆమె అచేతనంగా వాళ్ళవెంట నడిచింది,

కల్యాణికి స్నానం చేయిస్తున్నారు. దేహం పరాధీనం చేసి ఆమె కొయ్యబొమ్మవలె కూర్చున్నది. ఆలోచనలూ, ఆవేదనలూ పెనవేసుకొని మనసును కలిచి వేస్తున్నాయ్. తనకు మళ్ళీ స్నానం చేయిస్తున్నారు. ఈ రాత్రికి యింతటితో ముగిసిందనుకున్న పెండ్లి యింకా ముగియలేదు. ఈ రాత్రికే తన దేహాన్ని భర్తకు అర్పించమంటున్నారు. ఈ రాత్రికే తనకు కలగబోయే అత్యాచారాన్ని తలచుకొని కల్యాణి హృదయం కంపిం

చింది. పెండ్లి ఐన తర్వాతనైనా తన రాజాను కలుసుకోవచ్చునని హృదయంలో ఏ మూలనో అవ్యక్తంగా వున్న ఆశ మొదలంట కూలి పోయింది. తానింక ఏమని రాజా ముఖం చూడగలదు ? తన సర్వస్వమూ యెవరికో అప్పగించి రాజామీద ఏమని ఆశ పెట్టుకోగలదు ? తన భవిష్యత్తంతా అంధకారమైంది. తానింక బ్రతికి ప్రయోజనం ఏముంది ? యింత అత్యాచారానికి గురై, సరస్వమూ కోల్పోయి, బ్రతకడం యెందుకు ? యీ బ్రతుకు బ్రతకడం కంటె ఆత్మహత్య చేసుకోవడం మేలు. తన కింక ఆత్మహత్య తప్ప గత్యంతరం లేదు. ఔను — తాను తప్పక ఆత్మహత్య చేసుకుంటుంది. రేపే చేసుకుంటుంది. రేపు సాధ్యం కాక పోతే మరునాడు తప్పక నేసుకుంటుంది. కల్యాణి మనస్సు ఆత్మహత్యా మార్గాలను అన్వేషించడంలో నిమగ్నమైంది.

స్నానం ముగిసింది. కల్యాణికి కొత్త బట్టలు కట్టి అలంకరణ చేస్తున్నారు. దేహం పరాధీనం చేసి ఆమె కొయ్యబొమ్మవలె కూర్చున్నది. బాధామయమైన ఆలోచనలు ప్రభంజనంవలె మనసును కల్లోలం చేస్తున్నాయి. యీ అలంకరణ అంతా ఎవరికోసం ? యెవరో ముక్కుమొగ మెరుగని పురుషుని కోసం ! తన మనసుకు వ్యతిరేకంగా తన మెడలో తాళి గట్టిన భర్త కోసం ! రఘుపతిని ఊహించుకోబోయి ఆమె దేహం నిలువునా కంపించింది. తన రాజా — తాను మనసారా ప్రేమించిన రాజా వుండవలసిన పవిత్రస్థానాన్ని ఎవరో పరాయి వ్యక్తి ఆక్రమించుకున్నాడు ! ఇంత భయంకరమైన దుర్ఘటన తన కెందుకు సంభవిస్తున్నది ? ఇంత మహావమానకరమైన అత్యాచారానికి తానెందుకు తల ఒగ్గుతున్నది ? కాదు — తాను తల ఒగ్గదు — ప్రతిఘటించి తీరుతుంది. రేపే ఆత్మహత్య చేసుకుంటుంది. తన్నింత ఘోరమైన దుర్గతికి పాల్జేసిన వాళ్లందరూ గుండెలు బాదుకునేటట్లు తాను ఆత్మహత్య

చేసుకుంటుంది. రేపే చేసుకుంటుంది. తప్పితే మరునాడు తప్పక చేసుకుంటుంది. ఆత్మహత్య తప్ప ఈ జీవితానికింక మార్గాంతరం లేదు. కల్యాణి మనస్సు ఆత్మహత్యకు అనువైన పద్ధతులను వెదకడంలో నిమగ్న మైంది. ఆ ప్రయత్నంలో ఆమె మనస్సుకు ఒక విధమైన స్వస్థత చిక్కింది.

అలంకరణ పూర్తి అయింది. కల్యాణిని రెక్కలు పట్టుకొని మేడ మీదికి నడిపించుకొని పోయినారు. పడక గది దగ్గరికి తీసుకపోయి మెల్లగా లోపలికి నడిపించి తలుపులు మూసినారు. వాకిలి పంచన గోడ కానుకొని సర్వాభరణ భూషితమైన కల్యాణి తల వంచుకొని కొయ్యబొమ్మ వలె నిశ్చలంగా నిలబడి వుంది. ఆమె మనసులో యిప్పుడే ఆందోళనా లేదు. తన కెందుకు భయం ! తనకు భయపడవలసిన స్థితి దాటిపోయింది. తాను తప్పక రేపు ఆత్మహత్య చేసుకుంటుంది. ఈ జీవితానికిది ఆఖరు రాత్రి. ఈ ఘడియలో తన దేహంమీద అసహ్యకరమైన అత్యాచారం జరగబోతున్నది. యీ అత్యాచారానికి తాను ప్రతీకారం చేసి తీరుతుంది. రేపు ఆత్మహత్య చేసుకొని అందరికీ తగిన శిక్ష విధిస్తుంది. తన ప్రేమను, తన సుఖాన్ని, తన జీవితాన్ని యింత నిర్లక్ష్యంగా చూసిన లోకంమీద తాను తప్పక పగ సాధిస్తుంది. రేపు తప్పక ఆత్మహత్య చేసుకుంటుంది. గుండె రాయి చేసుకొని కల్యాణి కొయ్యబొమ్మవలె గోడ కానుకొని, తల నేలకు వంచుకొని, నిశ్చలంగా నిలబడి వుంది.

గది మధ్యలో మెల్లగా అలికిడైంది. కల్యాణి రెప్పలెత్తి చూసింది. పట్టెమంచంమీద కూర్చొని తన భర్త, తన మెడలో తాళి గట్టిన పెండ్లి కొడుకు తనవైపే చూస్తున్నాడు. కల్యాణి మళ్ళీ చూపులు నేలకు వాల్చింది. రఘుపతి లేచివచ్చి ఆమె దగ్గర నిలబడినాడు. ఆమె భుజం పట్టుకొని మెల్లగా మంచం దగ్గరికి నడిపించుకొని పోయినాడు.

కల్యాణి దేహం పరాధీనం చేసి కొయ్యబొమ్మవలె అతని ప్రక్కన నడిచింది. ఆమెను మంచంమీద కూర్చోబెట్టి అతను ప్రక్కనే కూర్చు న్నాడు.

"ఇటు చూడు" అన్నాడు అతను.

ఆమె పలకకుండా, కదలకుండా, నిశ్చలంగా వుంది.

అతను ఆమె తలమీద చేయిపెట్టి, ముఖం తన ప్రక్కకు తిప్పు కున్నాడు, తల కొంచెం పైకెత్తి ఆమె ముఖంలోకి చూసినాడు. కల్యాణి నిశ్చలంగా అతని కన్నుల్లోకి చూసింది. నిశ్చలంగా, నిర్వికారంగా వున్న ఆమె చూపులు భరించలేక అతను తనచూపులే ప్రక్కకు త్రిప్పుకున్నాడు. ఆమె మెల్లగా మళ్ళీ తల వంచుకుంది

"యీ పెండ్లి నీకిష్టం లేదా?" రఘుపతి ప్రశ్నించినాడు.

యిష్టం! నా యిష్టాయిష్టాలను యెవరడిగినారు! నాకు యిష్టా యిష్టాలు వున్నాయని ఎవరనుకున్నారు!

"చెప్పు — యీ పెండ్లి నీ కిష్టం లేదా?" రఘుపతి మళ్ళీ ప్రశ్నించినాడు.

మళ్ళీ అదే ప్రశ్న! ప్రశ్న అడిగే అధికారం ఎవరిచ్చినారు యీ మనిషికి! ఎవరితను! ప్రశ్నలకు జవాబివ్వవలసిన అవసరం తనకేమీ లేదు. తాను రేపు ఆత్మహత్య చేసుకుంటుంది.

"మీవాళ్ళు బలవంతంగా పెండ్లి చేసినారా?"

తనవాళ్ళు! ఎవరు తన వాళ్ళు! తనకెవరూ తన వాళ్ళు లేరు. అందరూ శత్రువులే. అందరూ అతని వాళ్ళే. అతనూ వాళ్ళలో వాడే. యీ లోకమంతా వాళ్ళే ఏలుకోనీ. తన కెందుకు? తాను రేపు ఆత్మహత్య చేసుకుంటుంది.

కల్యాణి తల నిమురుతూ రఘుపతి ఆప్యాయంగా అన్నాడు : "పలకవా ?"

పలకవలసిన పని ఏముంది ? తానెవరు ? ఇతనెవరు ? తనకూ ఇతనికీ ఏమి సంబంధం ? ఏమి సంబంధమున్నా ఈ ఒక్క రాత్రికే. తాను రేపు తప్పక ఆత్మహత్య చేసుకుంటుంది.

"పలికితే నోటి ముత్యాలు రాలుతాయా ?"

ఏమిటీ అసహ్యమైన సరసం ! తనతో సరసమాడే హక్కు యితని కెవరిచ్చినారు ! ఎన్ని సరసాలాడినా ఈ ఒక్క రాత్రికే. తాను రేపు ఈ లోకమే విడిచిపోతున్నది.

ఎన్ని ప్రశ్నలు వేసినా కల్యాణి మౌనంగా వుంది. గుండె రాయి చేసుకొని కొయ్యబొమ్మవలె నిశ్చలంగా వుంది. ఆమెతో ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం రాబట్టుకోలేక రఘుపతి సిగ్గుపడినాడు. కంఠం మార్చి తీవిగా అన్నాడు : "నీవు చేయరాని తప్పు చేసినావు. ఐనా నిన్ను క్షమించి ఉదారంగా పెండ్లి చేసుకున్నాను."

ఛీ ! ఏమిటీ స్వాతిశయం ! ఔదార్యమంట ! నాకింతటి మహోప కారం చేసిన వ్యక్తికి నేను కృతజ్ఞత చూపించవలెనంట ! ఎంతటి నైతిక దురహంకారం ! ఎంతటి దుర్భరమైన మనిషి ! యెంత దుర్భరమైనా ఈ రాత్రికే ! తాను రేపే దేహం వదలిపెడుతున్నది.

ఆమెతో ఒక మాట కూడా పలికించుకోలేక రఘుపతి విసుగు చెందినాడు. రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచినాయి. తరువాత అతను మెల్లగా ఆమె వీపుమీద చేయివేసినాడు. క్రమంగా ఆమె దేహాన్ని స్వాధీనం చేసుకోడానికి ప్రయత్నించినాడు.

కల్యాణి గుండె రాయి చేసుకొని కొయ్యబొమ్మవలె నిశ్చలంగా తన దేహం అతనికి అప్పగించింది.

(మార్చి 1960)